

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 22-04-2025 | సంపుటి - 22 | సంచిక - 357 | రూ : 4 | పేజీలు: 8


## మాకు నష్టం కలిగించారో.. ఖబడ్దార్

- అటు అమెరికా, ఇటు డ్రాగన్ హెచ్చరికలు
- అడకత్తెరలో ప్రపంచ దేశాలు

2లో



## ఉపాధికి గండి



- 6.5 కోట్ల పనిదినాలే మంజూరు చేసిన కేంద్రం
- నిరుటి కంటే 1.5 కోట్లు తగ్గింపు
- కేంద్రానికి లేఖ రాసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం

2లో

## రోదసిలో సేద్యం చేయనున్న శుభాంశు!

- ఐఎస్ఎస్‌లో ఏడు ప్రయోగాలు నిర్వహించబోతున్న ఇస్రో
- భవిష్యత్ అంతరిక్ష యాత్రికుల ప్రయోజనం కోసమే..

2లో



## 18 నోటిఫికేషన్ల జారీకి ఏపీపీఎస్సీ సిద్ధం

- ఎస్సీ వర్గీకరణ దృష్ట్యా శాఖల వారీగా రోస్టర్ పాయింట్ల ఖరారు కీలకం

**అమరావతి:** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వచ్చినందున ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి మార్గం సుగమమైంది. ఇప్పటికే మెగా డీఎస్సీ ప్రకటన జారీ కాగా, అదే మాదిరిగా ఏపీపీఎస్సీ కూడా పెండింగ్‌లో ఉన్న నోటిఫికేషన్ల

తరువాయి 2లో



# పెట్టుబడులు పెట్టండి

- జపాన్ వ్యాపారవేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానం
- 'వరల్డ్ ఎక్స్‌పో'లో తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభించిన సీఎం

**హైదరాబాద్:** ''తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. నవ ప్రపంచాన్ని నిర్మిద్దాం'' అని జపాన్ వ్యాపారవేత్తలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఆయన వివరించారు. జపాన్‌లోని ఒసాకాలో జరిగిన 'వరల్డ్ ఎక్స్‌పో'లో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సోమవారం పాలుపంచుకుంది. వివిధ రంగాలకు చెందిన వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలతో విడివిడిగా సమావేశమైంది. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై వారితో చర్చించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ''ఒసాకాలో జరుగుతున్న 'వరల్డ్ ఎక్స్‌పో'లో పాలుపంచుకున్న దేశంలోని మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలవడం గర్వంగా ఉంది. తెలంగాణ, జపాన్‌ల మధ్య

తరువాయి 2లో

శ్రీరామసాగర్, నిజాంసాగర్‌లలో

## పూడిక తీయిస్తాం

- నెల రోజుల్లో టెండర్లు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- రైతుభరోసా ఆలస్యానికి మన్నించాలి..
- త్వరలో మిగతా వారి ఖాతాల్లో జమ: మంత్రి
- నిజామాబాద్‌లో రైతు మహోత్సవం ప్రారంభం

**హైదరాబాద్ :** నిజామాబాద్: శ్రీరామసాగర్, నిజాంసాగర్ జలాశయాల సామర్థ్యం పెంచేందుకు పూడిక తొలగింపు చేపడతామని, ఇందుకు నెల రోజుల్లో టెండర్లు పిలుస్తామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. గత ప్రభుత్వం రూ. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కడితే.. మూడేళ్లకే కూలిందన్నారు. మనను,

తరువాయి 2లో



## తదుపరి పోప్ ఎవరు?

- రహస్యంగా ఎన్నుకోనున్న కార్డినళ్లు
- 20 రోజుల వరకూ పట్టే అవకాశం

పోప్ ఫ్రాన్సిస్ అస్తమయంతో 130 కోట్ల మంది క్యాథలిక్కులను ప్రాతినిధ్యం వహించే వాటికన్ చర్చికి తదుపరి అధిపతి ఎవరన్నదానిపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఉన్న కార్డినళ్లలో ఒకరు ఆ పదవిని చేపడతారు. ఇందుకోసం శతాబ్దాలుగా అనుసరిస్తున్న రహస్య ఓటింగ్ విధానంలోనే కార్డినళ్లు కొత్త పోప్‌ను ఎన్నుకోనున్నారు. బాప్టిజం అనుసరించే పురుష క్యాథలిక్ పోప్‌గా ఎన్నికవుతారు. 1378 నుంచీ కార్డినళ్లలో ఒకరినే పోప్‌గా ఎన్నుకుంటున్నారు. అయితే పోప్‌గా ఎన్నికయ్యే వ్యక్తి మూడింట రెండొంతుల మెజారిటీ సాధించాల్సి ఉంటుంది.

### ఇన్‌ఛార్జిగా ఎవరు?

పోప్ మరణిస్తే కామెర్లెంగోగా (చాంబర్లైన్) వ్యవహరిస్తున్న కార్డినల్.. తప్పనిసరిగా ధ్రువీకరించాలి. పాపల్ అపార్ట్‌మెంటుకు సీల్ వేయాలి. కొత్త పోప్ వచ్చేవరకూ ఆయనే వాటికన్ బాధ్యతలను చూస్తారు. ఐర్లాండ్‌లో జన్మించిన అమెరికన్ కెవిన్ ఫారెల్ కామెర్లెంగోగా ప్రస్తుతం ఉన్నారు.

తరువాయి 2లో





## ఉపాధికి గండి

- 6.5 కోట్ల పనిదినాలే మంజూరు చేసిన కేంద్రం
- నిరుటి కంటే 1.5 కోట్లు తగ్గింపు
- కేంద్రానికి లేఖ రాసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనిదినాల్లో కేంద్ర ప్రభుత్వం భారీగా కోత విధించింది. 202526 ఆర్థిక సంవత్సరానికి 12 కోట్ల పనిదినాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా.. 6.5

తరువాయి 2లో

ద్వైపాక్షిక సంబంధాలపై

## మోదీ, వాన్స్ సమీక్ష

- వాణిజ్య ఒప్పందంపై చర్చల్లో పురోగతిపై సంతృప్తి
- పలు అంతర్జాతీయ అంశాలపైనా ప్రధాని, అమెరికా ఉపాధ్యక్షుడి చర్చలు
- కుటుంబంతో కలిసి దిల్లీలో వాన్స్ విహారం

2లో



# ద్వైపాక్షిక సంబంధాలపై మోదీ, వాన్స్ సమీక్ష

దిల్లీ: ఉభయ దేశాల ప్రజలకు మేలు కలిగేలా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు భారత్, అమెరికా కొనసాగిస్తున్న చర్చల్లో పురోగతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంధనం, వ్యూహాత్మక సాంకేతికతలు, రక్షణ తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవడంపై దృష్టిసారించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం భారత్‌కు వచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ప్రధాని మోదీతో దిల్లీలో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతిని వారిద్దరూ సమీక్షించారు. రష్యాఉక్రెయిన్ యుద్ధం సహా పలు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపైనా సమాలోచనలు జరిపారు. దౌత్యం, చర్చలు మాత్రమే సమస్యల పరిష్కారానికి మార్గాలని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఏడాది భారత్‌లో చేపట్టనున్న పర్యటన కోసం తాను ఉత్సాహంగా ఎదురుచూస్తున్నట్లు వాన్స్‌తో మోదీ పేర్కొన్నారు. విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ తదితరులు భేటీలో పాల్గొన్నారు. వాన్స్‌తోపాటు పర్యటనకు విచ్చేసిన తెలుగు మూలాలున్న ఆయన సతీమణి ఉషా చిలుకూరి, మరికొందరు అమెరికా అధికారుల కోసం ప్రధాని ప్రత్యేక విందు ఏర్పాటుచేశారు. దిల్లీలోని తన నివాసంలో వాన్స్ దంపతులతో కలిసి మోదీ కలియతిరిగారు. వారి పిల్లలను ముద్దు చేస్తూ.. సరదాగా ముచ్చటించారు. చిన్నారులకు నెమలి పింఛాలను అందజేశారు. ఉషతోనూ మోదీ మాట్లాడారు. ఈ భేటీ వీడియోను ప్రధాని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు.

*** అక్షర్‌ధామ్ ఆలయాన్ని సందర్శించి..**

అంతకుముందు, 'ఎయిర్‌ఫోర్స్2' విమానంలో విచ్చేసిన వాన్స్‌కు దిల్లీలోని పాలం ఎయిర్‌బేస్‌లో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్వాగతం పలికారు. పిల్లలతో కలిసి వాన్స్ దంపతులు తొలుత స్వామినారాయణ్ అక్షర్‌ధామ్ ఆలయాన్ని సందర్శించారు. గొప్ప శిల్పకళా నైపుణ్యంతో నిర్మించిన అక్షర్‌ధామ్ ప్రధానంగా తమ పిల్లల్ని ఎంతగానో ఆకట్టుకుందని ఆలయ అతిథుల పుస్తకంలో వాన్స్ రాశారు. స్థానిక జన్‌పథ్‌లోని సెంట్రల్ కాటేజ్ ఇండస్ట్రీస్ ఎంపోరియం (సీసీఐఈ)ను వాన్స్ కుటుంబం సందర్శించింది. వాన్స్ దంపతుల కుమారులు ఇవాన్ (8), వివేక్ (5), కుమార్తె మీరాబెల్ (3) భారతీయ సంప్రదాయ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టినీ ఆకర్షించారు. ఇవాన్, వివేక్ కుర్తా పైజామా.. మీరాబెల్ అనార్కలీ సూట్, జాకెట్ ధరించి సందడి చేశారు. వారి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

## పెట్టుబడులు పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

చక్కటి సంబంధాలున్నాయి. వీటిని దీర్ఘకాల భాగస్వామ్యంగా మార్చుకుందాం. కొత్త ఆవిష్కరణలతో భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు కలిసి పనిచేద్దాం'' అని సీఎం పిలుపునిచ్చారు. ఒసాకా బేలో సూర్యోదయం లాంటి కొత్త అధ్యాయం తెలంగాణలో ప్రారంభమవుతోందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణతో పాటు ఒసాకా, ప్రపంచంతో కలిసి అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పేర్కొన్నారు.

### 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ: శ్రీధర్‌బాబు

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ''ఐటీ, బయో టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు సాధించింది. వీటితో పాటు ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్ రంగాల పరిశ్రమలకు తెలంగాణలో అనుకూల వాతావరణం ఉంది. హైదరాబాద్ సమీపంలో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. ఎకో, ఎనర్జీ, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీపై ఈ సిటీ ఆధారపడుతుంది. జపాన్‌కు చెందిన మారుబెని కార్పొరేషన్‌తో ఫ్యూచర్ సిటీలో ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నాం. హైదరాబాద్ చుట్టూ 370 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్లతో పాటు ఆర్ఆర్ఆర్, ఓఆర్ఆర్‌ల మధ్య ఉన్న జోన్‌లో విద్యుత్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్, ఏరో స్పేస్ పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉంది. ఎగుమతులకు వీలుగా సమీప ఓడరేవుతో అనుసంధానించే డ్రై పోర్ట్‌ను తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నాం. మూసీ పునరుజ్జీవంలో భాగంగా నది పొడవునా 55 కిలోమీటర్ల అర్బన్ గ్రీన్ వేని అభివృద్ధి చేసేందుకు టోక్యో, ఒసాకా నగరాలను చూసి ఎంతో నేర్చుకోవాల్సి ఉంది'' అని అన్నారు. నైపుణ్యాల శిక్షణతో పాటు నాణ్యత, క్రమశిక్షణకు అద్దం పట్టేలా 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ఏర్పాటు చేశామని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. ఈ యూనివర్సిటీ రాష్ట్రంలో ఉపాధి, వ్యాపార అవకాశాలను రెట్టింపు చేస్తుందన్నారు.

### ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ పెవిలియన్

కిటాక్యూషు నుంచి ఒసాకా చేరుకున్న ముఖ్యమంత్రి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సోమవారం ఉదయం భారత పెవిలియన్‌లో అడుగుపెట్టింది. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఒసాకా ఎక్స్‌పో నిర్వహిస్తారు. అందులో పాల్గొన్న దేశంలోని తొలి రాష్ట్రం తెలంగాణ కావటం విశేషం. ఈ ఎక్స్‌పోలో తెలంగాణ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో రాష్ట్ర సాంకేతిక పురోగతి, సాంస్కృతిక వారసత్వం, పర్యాటక సంపదను ప్రతిబింబించే ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. తెలంగాణ సంస్కృతి, పారిశ్రామిక అనుకూల వాతావరణం, కళలు, పర్యాటక ఆకర్షణలను సందర్శకులకు వివరించారు.

## రోదసిలో సేద్యం చేయనున్న శుభాంశు!

దిల్లీ: వచ్చే నెలలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) పయనమవుతున్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అక్కడ బస చేసే 14 రోజులు తీరికలేకుండా గడపనున్నారు. ఈ యాత్రలో ఆయన కనీసం ఏడు ప్రయోగాలు నిర్వహించనున్నారు. ఇందులో.. పంటల సాగు, రోదసిలో నీటి ఎలుగుబంట్ల జీవనంపై పరిశోధనలు వంటివి ఉంటాయి.

- యాక్సియమ్ మిషన్4 (ఏఎక్స్4)లో భాగంగా మే నెలలో శుక్లాతోపాటు అమెరికా, హంగరీ, పోలండ్‌లకు చెందిన మరో ముగ్గురు వ్యోమగాములు ఐఎస్ఎస్‌కు పయనమవుతున్న సంగతి తెలిసిందే. ఈ యాత్రలో అమెరికా రోదసి సంస్థనాసా, ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)ల భాగస్వామ్యంతో ఏడు ప్రయోగాలను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నిర్వహించనుంది.
- ఐఎస్ఎస్‌లో నీటి ఎలుగుబంట్లు మనుగడ, పునరుత్పత్తి తీరుతెన్నులను ఇస్రో పరిశీలించనుంది. వీటి జన్యు వ్యక్తీకరణ పోకడల్లో వచ్చే మార్పులను విశ్లేషించనుంది. భూమిపై బయోటెక్నాలజీ రంగంలో వినూత్న ఆవిష్కరణలకు ఇది వీలుకల్పిస్తుందని భావిస్తున్నారు. ఈ చిన్న జీవులు పుడమిపై దాదాపు 60 కోట్ల సంవత్సరాలుగా మనుగడ సాగిస్తున్నాయి. ఈ క్రమంలో ఎన్నో విపత్తులను తట్టుకొని ఈ జాతి నిలబడింది. భవిష్యత్‌లోనూ వాతావరణ మార్పులను ఇవి ఎదుర్కోగలవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
- రోదసిలో ఉండే భారరహిత స్థితిలో వ్యోమగాములు ఎలక్ట్రానిక్ డిస్ప్లేలను ఎలా నిర్వహిస్తారన్నదానిపై కూడా ప్రయోగం ఉంటుంది. తద్వారా అంతరిక్షంలో కంప్యూటర్ తెరల వినియోగం వల్ల శారీరక, విషయగ్రహణ సామర్థ్యం పరంగా పడే ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి వీలవుతుంది. ఒక అంశంపైకి దృష్టిని కేంద్రీకరించడం, వేగంగా కంటిపాపను కదిలించడం వంటి అంశాలపై భారరహిత స్థితి చూపే ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి ఈ పరిశోధన దోహదపడుతుంది. ఈ మార్పులు.. వ్యోమగామి ఒత్తిడి స్థాయిపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయన్నది కూడా తెలుసుకోవచ్చు. భవిష్యత్‌లో వ్యోమనౌకల్లో వాడే కంప్యూటర్ల డిజైన్, వ్యోమగాముల పనితీరులో చేయాల్సిన మార్పుల గురించి అవగాహన పెంచుకోవడానికి ఇది వీలు కల్పిస్తుంది.
- భారరహితస్థితి వల్ల మూడు రకాల మైక్రోఆల్గేల ఎదుగుదల, జీవక్రియలపై పడే ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి మరో ప్రయోగాన్ని ఇస్రో నిర్వహించనుంది. ఈ చిన్న జీవుల్లో ప్రొటీన్, లిపిడ్, ఇతర ప్రయోజనకర పదార్థాలు పుష్కలంగా ఉన్నాయి. సుదీర్ఘ అంతరిక్ష యాత్రల్లో వీటిని ఆహారంగా వ్యోమగాములు ఉపయోగించే అవకాశం ఉంది.
- ఈఎస్ఏతో చేపట్టే మరో ప్రాజెక్టు కింద సయనోబ్యాక్టీరియాపై పరిశోధనలు సాగించనున్నారు. నీటిలో ఉండే ఈ జాతి సూక్ష్మజీవులకు కిరణజన్యసంయోగ క్రియ సామర్థ్యం ఉంది.

## శ్రీరామసాగర్, నిజాంసాగర్‌లలో పూడిక తీయిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

మన పిల్లల్ని తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి ప్రయోజనం లేకుండా ఖర్చు చేశారని విమర్శించారు. సాగులో శాస్త్రీయ, యాంత్రీకరణ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు నిజామాబాద్ జిల్లా కేంద్రం గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న రైతు మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన 150 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మంత్రి ఉత్తమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. ధాన్యం ఉత్పత్తి, కొనుగోళ్లలో రాష్ట్రం రికార్డు నెలకొల్పిందని, కాళేశ్వరం నీరు లేకుండానే గత వానాకాలం, యాసంగిలో కలిపి రాష్ట్రంలో 281 లక్షల టన్నుల ధాన్యం పండిందన్నారు. ఈ స్థాయిలో ఉత్పత్తి, కొనుగోళ్లు జరిపిన రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ ద్వారా దొడ్డు బియ్యం అక్రమ దందాకు చెక్ పెట్టామన్నారు.

### రైతులను విదేశాలకు తీసుకెళ్తాం : తుమ్మల

రైతులకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆర్థిక కష్టాలున్న ఇంట్లో పెళ్లి జరిగితే ఎలా ఉంటుందో.. ప్రభుత్వ పరిస్థితి అలాగే ఉందని, అర్థం చేసుకోవాలన్నారు. పంటనష్ట పరిహారం త్వరలోనే అందిస్తామని ప్రకటించారు. రైతుభరోసా డబ్బులు మార్చి 31 వరకు వేస్తామని చెప్పి అందరికీ వేయలేకపోయామని, ఆలస్యానికి మన్నించాలని, త్వరలో మిగతా వారి ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో రైతులను ఇజ్రాయెల్ తీసుకెళ్లామని, ఆధునిక, శాస్త్రీయ పద్ధతులతో వ్యవసాయం చేసే దేశానికి మన రైతులను మళ్లీ తీసుకెళ్తామన్నారు. పొద్దుతిరుగుడు, జొన్న, మొక్కజొన్న కొనాలని రైతులు, తమ పార్టీ నేతల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని, ప్రభుత్వానికి నష్టం వచ్చినా.. మద్దతు ధరతో కొంటామని మాటిచ్చారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దాదాపు రూ.8 లక్షల కోట్ల అప్పులు చేయడంతో వడ్డీల భారం తమ ప్రభుత్వంపై పడుతోందని ఆరోపించారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పాలన సాగుతోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. అధికారులు, మంత్రులు వ్యవసాయ విధానాలపై అధ్యయనానికి విదేశాలకు వెళ్తుంటారని, వెంట రైతులను తీసుకెళ్తే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. దీనిపై మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించారు. నిజాంసాగర్ నిర్మాణంతో ఆంధ్ర ప్రాంతంలోని ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి రైతులు ఇక్కడికి వచ్చి స్థిరపడి వ్యవసాయం చేస్తూ.. తమ వాళ్లకూ నేర్పారని మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మంత్రి తుమ్మల స్పందిస్తూ వారంతా నిజాం కాలంలోనే వచ్చి స్థిరపడ్డారని సర్దిచెప్పారు. ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, ఆశిష్‌సాంగ్వాన్, పసుపు బోర్డు జాతీయ ఛైర్మన్ పల్లె గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాకు నష్టం కలిగించారో.. ఖబడ్దార్

బీజింగ్: కరవమంటే కప్పకు కోపం.. విడువమంటే పాముకు కోపం..! ఇదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార వాణిజ్య సుంకాలు విధించినప్పటి నుంచి చాలా ప్రపంచ దేశాల పరిస్థితి. చైనా, అమెరికాల మధ్య వాణిజ్య యుద్ధం పరాకాష్ఠకు చేరిన నేపథ్యంలో పలు దేశాల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. ఈ రెండు దేశాలు.. ఇప్పుడు మిగతా దేశాలను బెదిరించడం ప్రారంభించాయి. చైనాతో వాణిజ్యాన్ని తగ్గించుకుంటే సుంకాలపై రాయితీలిస్తామని.. లేకపోతే విరుచుకుపడతామని అమెరికా హెచ్చరిస్తుంటే.. అగ్రరాజ్య ఒత్తిడికి తలొగ్గి తమ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఏ దేశమైనా వ్యవహరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని చైనా చెబుతోంది.

**అలాగైతేనే ఉపశమనం..!**

సుంకాల నుంచి ఉపశమనం పొందాలంటే చైనాతో ఆర్థిక బంధాన్ని తెంచుకోవాలని వాణిజ్య చర్చల్లో వివిధ దేశాలకు ట్రంప్ సర్కారు షరతులు పెడుతోంది. చైనా నుంచి దిగుమతులు చేసుకోవద్దని, ఆయా దేశాల్లో బీజింగ్ కంపెనీల ఏర్పాటును కూడా తిరస్కరించాలంటోంది. భారత్, జపాన్ సహా 70కు పైగా దేశాలు ప్రస్తుతం అమెరికాతో సుంకాలపై చర్చలు జరుపుతున్నాయి అగ్రరాజ్యం పెడుతున్న ఈ షరతులపై బీజింగ్ ఘాటుగా స్పందించింది. తమ దేశ ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ఏ దేశమైనా అగ్రరాజ్య ఒత్తిడికి తలొగ్గి నిర్ణయాలు తీసుకుంటే తాము ఊరుకొనే ప్రసక్తి లేదని హెచ్చరించింది.

## ఉపాధికి గండి

హైదరాబాద్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనిదినాల్లో కేంద్ర ప్రభుత్వం భారీగా కోత విధించింది. 202526 ఆర్థిక సంవత్సరానికి 12 కోట్ల పనిదినాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా.. 6.5 కోట్ల పనిదినాలనే కేంద్రం మంజూరు చేసింది. నిరుడు 8 కోట్ల పనిదినాలు మంజూరు చేయగా.. ఈసారి అందులో 1.5 కోట్లు తగ్గించింది. డిమాండ్ ఆధారంగా కాకుండా అవసరాల ప్రాతిపదికన పనులు చేపట్టాలంటూ రాష్ట్రానికి రాసిన లేఖలో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

### నాలుగేళ్లుగా పెద్దఎత్తున పనులు

ఉపాధి హామీ కింద నాలుగేళ్లుగా రాష్ట్రంలో పెద్దఎత్తున పనులు చేపట్టారు. కేంద్రం ఏటా 8 కోట్ల చొప్పున పనిదినాలు మంజూరు చేస్తుండగా.. వాటికన్నా ఎక్కువ పనులు జరుగుతున్నాయి. 202122లో 10 కోట్లు, 202223లో 10 కోట్లు, 202324లో 11 కోట్లు, 202425లో 12 కోట్ల పనిదినాలు పూర్తి చేశారు. ఈ ఏడాది మాత్రం పనిదినాలను కేంద్రం 6.5 కోట్లకే పరిమితం చేయడంతో పాటు తాము నిర్దేశించిన పనులే చేయాలని ఆంక్షలు విధించింది. నిరుడు పలు జిల్లాల్లో వంద శాతానికి మించి పనులు జరగడాన్ని అనుమానించిన కేంద్ర ప్రభుత్వం... రాష్ట్రానికి ప్రత్యేక బృందాలను పంపి క్షేత్రస్థాయి తనిఖీలు చేయించింది. పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా పనులు చేశారని గుర్తించింది. ఈ నేపథ్యంలోనే పనిదినాలను తగ్గించినట్లు తెలుస్తోంది.

## ఉపాధికి గండి

(మొదటిపేజీ తరువాయి)

కోట్ల పనిదినాలనే కేంద్రం మంజూరు చేసింది. నిరుడు 8 కోట్ల పనిదినాలు మంజూరు చేయగా.. ఈసారి అందులో 1.5 కోట్లు తగ్గించింది. డిమాండ్ ఆధారంగా కాకుండా అవసరాల ప్రాతిపదికన పనులు చేపట్టాలంటూ రాష్ట్రానికి రాసిన లేఖలో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

### నాలుగేళ్లుగా పెద్దఎత్తున పనులు

ఉపాధి హామీ కింద నాలుగేళ్లుగా రాష్ట్రంలో పెద్దఎత్తున పనులు చేపట్టారు. కేంద్రం ఏటా 8 కోట్ల చొప్పున పనిదినాలు మంజూరు చేస్తుండగా.. వాటికన్నా ఎక్కువ పనులు జరుగుతున్నాయి. 202122లో 10 కోట్లు, 202223లో 10 కోట్లు, 202324లో 11 కోట్లు, 202425లో 12 కోట్ల పనిదినాలు పూర్తి చేశారు. ఈ ఏడాది మాత్రం పనిదినాలను కేంద్రం 6.5 కోట్లకే పరిమితం చేయడంతో పాటు తాము నిర్దేశించిన పనులే చేయాలని ఆంక్షలు విధించింది. నిరుడు పలు జిల్లాల్లో వంద శాతానికి మించి పనులు జరగడాన్ని అనుమానించిన కేంద్ర ప్రభుత్వం... రాష్ట్రానికి ప్రత్యేక బృందాలను పంపి క్షేత్రస్థాయి తనిఖీలు చేయించింది. పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా పనులు చేశారని గుర్తించింది. ఈ నేపథ్యంలోనే పనిదినాలను తగ్గించినట్లు తెలుస్తోంది.

### రాష్ట్ర ప్రభుత్వ అసంతృప్తి

పనిదినాలను కుదించడంతో పాటు పనులపై ఆంక్షలు విధించడంపై రాష్ట్ర ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. రాష్ట్రంలో రహదారులు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు ఉపాధి నిధులను వినియోగిస్తున్నారు. ఈసారి కొత్తగా చేపల కొలనుల నిర్మాణం చేపట్టింది. పనులను కుదిస్తే వాటన్నింటిపైనా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీల గుర్తింపునకు 100 రోజుల పాటు పనిచేసేవారిని రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోంది. దీంతో పనులకు వస్తున్న కూలీలు పెరుగుతున్నారు. కొత్తగా జాబ్‌కార్డులు ఇవ్వాలంటూ పెద్దసంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పనిదినాలు పెంచాలంటూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క యోచిస్తున్నారు. మరోవైపు, కేంద్రం కేటాయింపులకు అనుగుణంగా జిల్లాలవారీగా చేపట్టే పనులపై రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కార్యాచరణ ప్రణాళిక విడుదల చేసింది. ఈ ఏడాది మహిళా శక్తి ఉపాధి భరోసా, పొలం బాటలు, ఫల వనాలు, వనమహోత్సవం, జల నిధి, గ్రామీణ పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టాలని నిర్ణయించింది. వేతనాలకు రూ.1,625 కోట్లు, మెటీరియల్ కంపోనెంట్‌కు రూ.1,083 కోట్ల మేర నిధులు మంజూరు చేస్తూ దస్త్రంపై మంత్రి సీతక్క సంతకం చేశారు.

## 18 నోటిఫికేషన్ల జారీకి ఏపీపీఎస్సీ సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

విడుదలకు సిద్ధమైంది. ఈ ఉద్యోగాల భర్తీకి గత జనవరిలోనే ప్రకటన ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించినప్పటికీ, ఎస్సీ వర్గీకరణ దృష్ట్యా ఆలస్యమైంది. ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 866 పోస్టుల భర్తీకి సంబంధించి 18 నోటిఫికేషన్లు ఏపీపీఎస్సీ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో అటవీ శాఖకు సంబంధించి 814 పోస్టులున్నాయి. అయితే, ఖాళీల వివరాలు పంపిన ప్రభుత్వ శాఖలు.. ఎస్సీ వర్గీకరణకు తగ్గట్లు రోస్టర్ పాయింట్లు ఖరారు చేయాల్సి ఉంది. ఈ కసరత్తు సత్వరమే చేపడితే నెల రోజుల్లో పూర్తిచేయొచ్చు. ఈ వివరాలు అందిన వెంటనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ల జారీకి చర్యలు తీసుకోనుంది.

## తదుపరి పోప్ ఎవరు?

(మొదటిపేజీ తరువాయి)

పోప్ మరణించగానే కొంత మందికి తప్ప అందరికీ వాటికన్ పదవులు పోతాయి.

### ఎవరు ఎన్నుకుంటారు?

పోప్ సంతాప దినాల అనంతరం కార్డినళ్ల సమావేశం జరుగుతుంది. కొత్త పోప్‌ను 80 ఏళ్లలోపు వయసున్న కార్డినళ్లు ఎన్నుకుంటారు. నిబంధనల ప్రకారం.. వారిలోనూ 120 మందికే ఓటు హక్కు ఉంటుంది. కానీ ప్రస్తుతం 80 ఏళ్లలోపు వారు 135 మంది ఉన్నారు. పోప్ ఎన్నిక కోసం సమావేశం జరిగే సమయానికి ఈ కార్డినళ్ల సంఖ్యలో మార్పులు చోటుచేసుకోవచ్చు.

### ఎన్నిక ఎలా?

పోప్ ఎన్నికకు పూర్తిగా రహస్య విధానంలో ఓటింగ్ జరుగుతుంది. సిస్టీన్ చాపెల్‌లో జరిగే ఓటింగ్‌లో పాల్గొనే ప్రతి కార్డినల్.. ఓటింగ్ సమయంలో చర్చించిన అంశాలను రహస్యంగా ఉంచుతానని ప్రమాణం చేయాల్సి ఉంటుంది. దీనిని ఉల్లంఘిస్తే బహిష్కరణ వేటు పడుతుంది. తొలిరోజు ఎవరికీ మూడింట రెండొంతుల మెజారిటీ రాకపోతే రోజువారీ నాలుగు రౌండ్ల చొప్పున ఎవరో ఒకరికి మెజారిటీ లభించే వరకు ఓటింగ్ జరుగుతుంది. ఈ ఎన్నికల ప్రక్రియకు మొత్తం 15 నుంచి 20 రోజుల సమయం పట్టొచ్చు. కాకపోతే పోప్ జాన్‌పాల్ 2 ఈ విధానంలో స్వల్ప మార్పు చేసినట్లు చెబుతారు. 'తొలి రోజు ఎన్నికలోనే మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. అదే 1012 రోజుల వరకూ మెజారిటీ రాకపోతే సాధారణ మెజారిటీని పరిగణనలోకి తీసుకోవాలి' అని ఆయన సూచించారు. ఎన్నికలో ఎవరూ విజయం సాధించకపోతే.. బ్యాలెట్ పత్రాలను నల్లటి పొగను విడుదల చేసే ప్రత్యేక రసాయనాలతో కాల్చేస్తారు. అలా కాకుండా తెల్లటి పొగ వెలువడితే పోప్ ఎన్నికైనట్లు సంకేతం. బయట ఉన్న వారికి ఎన్నిక ఫలితం తెలియజేయడం కోసం ఈ విధానం వినియోగిస్తారు.

## భూ భారతిలో 'ఈకేవైసీ' కష్టాలు

హైదరాబాద్: సాగు భూముల రిజిస్ట్రేషన్ పోర్టల్ భూ భారతిలో దరఖాస్తుల నిమిత్తం మీసేవ కేంద్రాలకు వెళ్తున్న రైతులకు 'ఈకేవైసీ' పూర్తికావడం లేదు. వారసత్వ బదిలీ, సమాచార సవరణ, తండ్రి పేరు, లింగం, భూ విస్తీర్ణంలో మార్పులు తదితర వాటికి దరఖాస్తు చేసే వారు ఫీజు చెల్లించాక ఈకేవైసీ అడుగుతోంది. ఈ ప్రక్రియలో 'ఎలక్ట్రానిక్ రూపంలో వినియోగదారుడు ఎవరు' అన్న వివరాలను బయోమెట్రిక్ ద్వారా సమర్పించాలి. కానీ, ఆన్‌లైన్‌లో ఆ ఐచ్ఛికం కనిపించడం లేదు. ధరణి పోర్టల్‌లోనూ ఈకేవైసీ ఉన్నా సదరు ఐచ్ఛికం తెరుచుకునేది. లాగిన్ అయితేనే.. కొత్త పోర్టల్లో లావాదేవీలకు సంబంధించి ఏదైనా సమాచారం తెలుసుకోవాలంటే రైతులు తప్పనిసరిగా లాగిన్ కావాల్సి వస్తోంది. పేరు, ఫోన్ నంబరు నమోదు చేసి ఓటీపీ పొందాలి. దీనిపై అవగాహన లేని రైతులు మీసేవ కేంద్రాలను సంప్రదిస్తున్నారు. అక్కడి నిర్వాహకులు కొంత రుసుము తీసుకొని వారి లాగిన్ ద్వారా కావాల్సిన సమాచారం తెలియజేస్తున్నారు. ధరణిలో లాగిన్ విధానంతోపాటు సాధారణ పద్ధతిలోనూ పోర్టల్‌ను తెరిచి చూసుకునే వీలుండేది. గ్రామాలు, కమతాల భూమి పటం కూడా ధరణి మాదిరిగా భూ భారతిలో తెరుచుకోవడం లేదు. జిల్లా, మండలం, గ్రామం, సర్వే నంబరు, ఖాతా తదితర వివరాలు నమోదు చేస్తే ఆ గ్రామ భూమిపటంలో వివరాలు కనిపించాల్సి ఉంటుంది. పైలట్ మండలాల్లో పరిశీలన పూర్తయ్యాక కొత్త పోర్టల్‌లో అన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని రెవెన్యూవర్గాలు పేర్కొంటున్నాయి.

# జాతీయ ఒలంపియాడ్ ర్యాంకులలో నారాయణ విద్యార్థుల ప్రభంజనం




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఒలంపియాడ్ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన 202425 విద్యా సంవత్సరానికి సినాప్స్ కు సంబందించిన ఎనిమిది విభాగాలలో నిర్వహించిన పోటీ పరీక్షలలో పాల్వంచ బ్రాంచి నారాయణ పాఠశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు జానకీనాద్ 2వ , సాయితేజ 3వ, యువ చంద్ర 4వ, చంద్రశేఖర్ 5వ, నాగ లక్ష్మి 6వ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని నారాయణ పాఠశాలల ఖమ్మం జిల్లా ఏ.జీఎం యోగ రాంకీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హైద్రాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన అవార్డుల పంపిణి కార్యక్రమంలో నారాయణ పాఠశాలల జీఎం గోపాల్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల



ప్రాంతం పాల్వంచ నుండి జాతీయ ర్యాంకులు పొందిన నారాయణ పాఠశాల పాల్వంచ బ్రాంచి విద్యార్థులను, అద్భుత విజయానికి కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు, విద్యార్థులు ఎంత క్రమ శిక్షణతో ఉంటారో వారి భవిష్యత్తు అంత ఉన్నతంగా ఉంటుందని, విద్యార్థులను అన్నిరంగాలలో ముందంజ వేయడానికి, విలువలతోకూడిన విద్యను నేర్పించడానికి నారాయణ యాజమాన్యం అధిక ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిఎం రమణా రెడ్డి, ఏజీఎం రాంకి, ప్రిన్సిపాల్ నరసింహ రావు, ఈ టెక్నో కోఆర్డినేటర్ ప్రవీణ్, ఈ చాంప్స్ కోఆర్డినేటర్ వినోద, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యం





ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన మీస బబ్లూ అనే యువకుడు అప్పుల బాధ భరించ లేక గత పది నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా అతనిది నిరుపేద కుటుంబం కావడంతో బబ్లూ సంవత్సరీకానికై 50 కిలోల బియ్యాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి సోమవారం అందజేశారు. ముందుగా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ నల్ల బుచ్చయ్య, మహిళా అధ్యక్షురాలు వనిత, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రంజాన్ నరేష్, దుబ్బాక రాజు, మచ్చ కొండయ్య, మిరుదొడ్డి భాను, ఎద్దండి మహేందర్ రెడ్డి, బాలకల్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, మాడూరి కిషన్, నల్ల వెంకటి, ఆంజనేయులు తదితరులున్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న మినీ టిప్పర్ లారీ పట్టివేత



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:ముస్తాబాద్ మండలంలోని కొండపూర్ వాగు నుంచి మినీ టిప్పర్ లారీలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ముస్తాబాద్ ఎస్సై గణేష్ పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన చింతల శీను ను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించినట్లు, మినీ టిపర్ను సీజ్ చేశామని తెలిపారు. టిప్పర్ యాజమాని నునుగూరి సత్యలక్ష్మి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో 2004 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రామవరంలోని నేతాజీ ప్రభుత్వ పాఠశాల లో 2004 పదవ తరగతి చదువుకున్న బ్యాచ్ ఆదివారం పాఠశాల లో 20 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు, ఈ యొక్క ఆత్మీయ సమ్మేళనం లో పూర్వ విద్యార్థుల వారి కుటుంబ సభ్యులతో సహా కలిసి వచ్చారు, కుటుంబ సభ్యులను స్నేహితులకు పరిచయం చేసుకున్నారు, వారియొక్క ప్రస్తుత జీవన విధానం పై మరియు సుఖదుఃఖాలు చర్చించుకున్నారు, 20 సంవత్సరాల తరువాత ఇలా కుటుంబసభలతో సహ స్నేహితులను కలుపు కోవటం చాలా సంతోషంగా ఉందనీ అన్నారు,ఈ యొక్క కారిక్రమంలో 2004 నాటి నేతాజీ స్కూల్ హెడ్మాస్టర్ నీరజ మేడం, శ్రీలక్ష్మి మేడం, ప్రవీణ్ హాజరైయ్యారు. వీరికి పూర్వ విద్యార్థులు శాలువాలతో సత్కరించారు, గురువులు మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు, 20 సంవత్సరాల తరువాత ఇలా పూర్వా విద్యార్థులను కలుసుకోవటం చాల ఆనందంగా ఉందన్నారు, ఇలానే అందరు కలిసి మెలిసి ఆనందంగా ఉండాలని ఆశీర్వదించారు, అనంతరం విద్యార్థులు కెక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు, ఈ యొక్కా కారిక్రమంలో పూర్వ విద్యార్థిని విద్యార్థులు ఖయ్యూం, కృష్ణ, శంకర్,జానీ, రవీందర్, సురేష్, రాజేష్, శ్రీకాంత్, శ్రీను,రఘు, శ్రావణి, శ్యామల, అప్సానా, రుబినా, జాస్మిన్, రాజయ్య, కల్పన, జగదీశ్వరి, లలిత, సుజాత, రమణ తధితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట దేవస్థానంలో
# అక్రమాల పై ఈవో భాస్కర్ రావుకి వినతి



యాదగిరిగుట్ట ప్రజాస్ఫూర్తి : యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో కొండ కింద ప్రధాన రహదారి మరియు రింగ్ రోడ్డు చుట్టూ ఏర్పాటు చేసేనటువంటి లైటింగ్ బోర్డుల విషయంలోదేవస్థానం ఈవో భాస్కర్ రావుకి భాజపా ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా కర్రే ప్రవీణ్ మాట్లాడుతూ కేవలం కొండమీద పెద్దయ్యగారి కొడుకు కావడం చేత ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఏర్పాటు చేసినటువంటి స్ట్రీట్ లైట్లకు వ్యాపార ప్రకటన నిమిత్తం లైటింగ్ బోర్డులను ఏర్పాటు చేసి దేవస్థాన ఆస్తులకు నష్టం కలిగించాడు ఇప్పటివరకు కూడా ఎలాంటి చర్యలు లేకపోగా అధికారులు నిమ్మకు నీరుతున్నట్టుగా వ్యవహరిస్తున్నారు అతని కాలపరిమిత అయిపోయినా కూడా అధికారులు తమ రాజకీయ నాయకులు అండదండలతోవారం రోజుల లైటింగ్ బోర్డు ఏర్పాటు చేసినాడు దీంతోపాటు కొండపైన ఔట్సోర్సింగ్ ఉద్యోగం చేయాలన్న కూడా కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మాత్రమే ఇక్కడ పనిచేయాలి. ఎమ్మెల్యే లెటర్ లేనిదే ఇక్కడ కాంట్రాక్ట్ ఉద్యోగం కూడా రాదు ఎన్నో ఏళ్లుగా ఎన్ఎంఆర్ లుగా పని చేసినటువంటి వారిని మీరు పర్మినెంట్ చేయకపోగా ప్రభుత్వం పర్మినెంట్ ఆర్డర్ ఇచ్చినా కూడా దాన్ని అమలు చేయకపోగా కోర్ట్ లో సవాల్ చేస్తూ అన్యాయం చేస్తున్నారు రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా యాదగిరిగుట్ట దేవస్థానంలో డీఈఓ పోస్ట్ సృష్టించి ఆ పోస్ట్ ని అడ్డం పెట్టుకొని టెండర్లలో తమ నచ్చిన వారికి కేటాయిస్తూ నచ్చిన విధంగా నిబంధనలు మారుస్తూ స్వామివారికి ఆదాయానికి గండి కొట్టే విధంగా వ్యవహరిస్తున్నాడు దాంతోపాటు ఆ యొక్క డిఇఓ కుటుంబం మొత్తానికి వాళ్ళ అన్నకి ,తమ్ముడికి పర్మినెంట్ జాబు రావడంలో కీలకపాత్ర పోషించినాడు నిన్న గాక మొన్న కూడా ఔట్సోర్సింగ్ పద్ధతిన వాళ్ళ అన్న కొడుకును శివాలయంలో పూజారిగా నియమించినాడు మరి ఇతని అవినీతికి అడ్డు లేదా లేకపోతే రాజకీయ నాయకులు అండదండ తోనే ఇలా వ్యవహరిస్తున్నాడా వేములవాడ నుంచి వచ్చినటువంటి ఏఈఓ కి కూడా డీఈవో ప్రమోషన్ వచ్చింది ఇక్కడ అతనికి స్థానం కేటాయించకపోగా ఇప్పుడు ఉన్న భాస్కర్ శర్మా ను ఇక్కడనే కొనసాగిస్తున్నారు దీని వెనుక ఆంతర్యం ఏమిటో ఈఓ చెప్పాలని డిమాండ్ చేస్తూ అతనిపైన శాఖ పరమైన చర్యలు తీసుకొని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య మాజీ మండల అధ్యక్షులు గుంటుపల్లి సత్యం పట్టణ ప్రధాన కార్యదర్శి ఆకుల చంద్రమౌళి ,జల్ల భానుచందర్ ,పట్టణ కార్యదర్శి దొమ్మాట ప్రభాకర్ ,బీజేవైఎం పట్టణ అధ్యక్షులు బోడబుచ్చిబాబు ,ఓబీసీ మోర్చా అధ్యక్షులు మందోజి నరేష్ ,సీనియర్ నాయకులు అశోక్ ,చిత్తర్ల కృష్ణ, కర్రే లక్ష్మయ్య లంకలపల్లి శ్రీను ,శివరాత్రి వంశీ ,వాల్మీకి అజయ్ ,ఆకుల దేవేందర్ ,బొమ్మ నరేష్ ,రుద్రాక్ష నవీన్ ,కర్రే శ్యామ్ ,సుంద ప్రవీణ్ ,వంగ శ్రీకాంత్ ,వంగ శ్రీకాంత్ ,సుదగాని శివ ,మధు ,వంశీ తదితరులు పాల్గొన్నారు



## ఎస్సీ రిజర్వేషన్
# అమలు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

*** వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లకు ఘన సన్మానం**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ఎస్సీ రిజర్వేషన్ అమలు చేసిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి బేడ బుడగ జంగాల సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు బేడ బుడగ జంగాల ఉపకులాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం రత్నానగర్ బేడ బుడగ జంగాల కాలనీలో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్ లను బేడ బుడగ జంగాల సంఘం నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. బేడ బుడగ జంగాల మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు పస్తం గంగరాములు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మాదని గోపాల్, మండల అధ్యక్షుడు తూర్పాటి శంకరయ్య, శ్రీ సీతా రామ దేవస్థాన ధర్మకర్త తూర్పాటి నర్సింహ్మలు పూలమాలలు, శాలువాలతో నూతన కమిటీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పస్తం యాదయ్య, పస్తం కృష్ణ, మాదని ఎల్లప్ప, పస్తం రాంబాబు తూర్పాటి దశరథ, తూర్పాటి పెంటయ్య, తూర్పాటి నర్సింహ్మ, పస్తం శ్రీను, తూర్పాటి నర్సింహ్మ, పస్తం కుమార్, తూర్పాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

## రైతు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిజెపిలో చేరిక

రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజాపేట మండల పార్టీ సమావేశంలో భాగంగా సోమవారం కుర్రారం గ్రామం కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెంటపర్తి నరేందర్ రెడ్డి, బి. ఆర్. ఎస్. నాయకులు రేకులపల్లి భాస్కర్ రెడ్డి నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ఆకర్షితులై భారతీయ జనతా పార్టీలో చేరారు. వీరిని రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్ కండువా కప్పి ఆహ్వానించారు, ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు మేకల రమేష్, సీనియర్ నాయకులు కానుగంటి శ్రీనివాసు రెడ్డి, మాజీ అధ్యక్షులు కాయితి బాల్ రెడ్డి, జిల్లా నాయకులు బూరుగు శేఖర్ రెడ్డి, పుట్ట వీరయ్య, దాచేపల్లి శ్రీను, గాండ్ల నర్సింగ రావు,గుజ్జ రామచంద్రం, భూక్యా



శ్రీను నాయక్, మెండు భగవాన్ రెడ్డి,మార్క శివ,కోయ మధు,బొంగోని నర్సయ్య, ఉప్పరి మల్లేశం, బూరుగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## బండి మల్లయ్యా ను ఆదుకోవాలి

*** భువనగిరి పార్లమెంటు ఇన్చార్జి క్యామ మల్లేశం**



రాజాపేట, ప్రజాస్ఫూర్తి : రాజాపేట మండలం రేణుకుంట గ్రామంలో ఇటీవల పిడుగు పాటుకు రైతు బండి మల్లయ్య కు చెందిన 60 మేకలు, గొర్రలు మృతి చెందగా సోమవారం ఈ విషయం తెలుకున్న టిఆర్ఎస్ భువనగిరి పార్లమెంటు ఇంచార్జి క్యామ మల్లేశం రైతు మల్లయ్య నివాసానికి వెళ్లి ఓదార్చి ధైర్యంగా ఉండాలని చెపుతూ ఆర్థిక సహాయం అందజేశారు. నష్టపోయిన రైతు బండి మల్లయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో రాజాపేట మండల పార్టీ అధ్యక్షలు సట్టు తిరుమలేష్ , మాజీ సర్పంచ్ బూరుగు భాగ్యమ్మ నర్సింహా రెడ్డి , పి. ఎ. సి. ఎస్. బ్యాంక్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, రాజాపేట మండల కురుమ సంఘం అధ్యక్షలు వస్పరి సుధాకర్, భువనగిరి యాదగిరిగుట్ట మాజీ జడ్పీటీసీలు సుబ్బురు బీరు మల్లయ్య, తోటకూరి అనురాధ బీరయ్య, యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు కర్రే వెంకటయ్య , జిల్లా కురుమ సంగం అధ్యక్షులు గవ్వల నర్సింహులు, రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు, జాల మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, గొర్రె కాపర్ల సంగం డైరెక్టర్ జెల్లి నర్సింహులు, మాసాయి పేట మాజీ సర్పంచ్ నర్సింగ్ రావు , భువనగిరి జిల్లా నాయకులు డా|| రాకెలా శ్రీనివాస్ కురుమ , మంగ వెంకటేష్ కురుమ , రేగు సిద్దులు, బర్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లకు ఘన సన్మానం





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డిలను చౌటుప్పల్ మండల విజయ ధన్వంతరి గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు గట్టు సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన పదవులు చేపట్టడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు. జ్ఞాపికను అందజేశారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని, భవిష్యత్తులో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విజయ ధన్వంతరి గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ అధ్యక్షుడు బొమ్మిడి సత్తిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నలపరాజు లింగయ్య , గౌరవ అధ్యక్షులు గంగాపురం సత్యనారాయణ, నిమ్మల యాదగిరి, సాతిరి శ్రీధర్, మండల ఉపాధ్యక్షుడు మైలారం రాజు, మండల ప్రధాన కార్యదర్శి కొంగరి ప్రసాద్, గట్టు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి ఒకరు మృతి

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ఎండి.రషీద్ (46) చెరువులో పడి మృతి చెందాడు. రషీద్ తన స్నేహితుడు ఎండి.బాబాతో కలిసి కొండాపూర్ పెద్ద చెరువులో సోమవారం చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో బురద కుంటలో చిక్కుకొని నీట మునిగి చనిపోయాడని తెలిపారు. ఈ మేరకు మృతుని భార్య ఎండి.షాహనాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు.

# భద్రాద్రి జిల్లాలో వరుస ఏసీబీ దాడులు

* **మొన్న భద్రాచలం సిఐ.. నేడు మణుగూరు సిఐ..**
* **రేపు ఎవరో మరి...?**
* **పోలీస్ శాఖపై ప్రత్యేక దృష్టి...**
* **వలవేసి పట్టుకుంటున్న ఏసీబీ అధికారులు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అవినీతి చేపలు వరుసగా ఏసీబీ అధికారుల చిక్కుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ అధికారులు వలపన్ని మరీ అవినీతి చేపలను పట్టుకుని కటకటాలపాలు చేస్తున్నారు. ప్రత్యేకంగా పోలీస్ శాఖపై నిఘా పెట్టి మరీ ఏసీబీ అధికారులు దాడులు చేస్తుండటం గమనార్హం. పోలీస్ శాఖలో పరాకాష్టకు చేరిన అవినీతికి ఈ సంఘటనలు నిదర్శనమని ప్రజలు చెప్పుకుంటున్నారు. ఏసీబీ అధికారులు ప్రజల్లో కల్పిస్తున్న అవగాహనతో లంచగొండి అధికారుల పనిపట్టేందుకు బాధితులు ఏసీబీని సంప్రదిస్తుండటంతో ఈ అవినీతి అక్రమార్కుల బాగోతాలు బయటపడుతున్నాయి. ఇటీవల భద్రాచలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బరపటి రమేష్ గ్రావెల్ తొలకాల కోసం వ్యక్తి వద్ద నుంచి



లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో వారు సీఐను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయం విధితమే. తాజాగా సోమవారం సైతం పోలీస్ శాఖకు చెందిన అవినీతి అధికారి ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ మేరకు ఖమ్మం ఏ సి బి డీఎస్పీ వై. రమేశ్ వివరాలు వెల్లడించారు. మణుగూరు పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఇన్‌స్పెక్టర్) సోమ సతీష్ కుమార్, బిగ్ టి.వి. రిపోర్టర్ మిట్టపల్లి గోపితో కలిసి బాధితుడి వద్ద నుంచి రూ.4 లక్షలు డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన ఒక క్రైం (నెం. 150/2025) నందు ఫిర్యాదుదారు, అతని మేనల్లుడి పేర్లను చేర్చకుండా ఉండేందుకు గాను మధ్యవర్తుల ద్వారా ఇన్‌స్పెక్టర్ రూ.4 లక్షలు లంచం డిమాండ్ చేయగా బాధితుడు రూ.1 లక్ష పాక్షిక చెల్లింపు చేస్తుండగా ఏసీబీ అధికారులు మెరుపుదాడి చేసి ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్‌తోపాటు బిగ్‌టీవీ రిపోర్టర్ మిట్టపల్లి గోపిలను అదుపులోకి తీసుకున్నారు. వీరిని వరంగల్‌లో 3వ అదనపు సెషన్స్ జడ్జి ఎదుట హాజరుపర్చనున్నట్లు ఏసీబీ అధికారులు చెప్పారు. ఏసీబీ అధికారులు నిర్వహించిన రసాయన పరీక్షల్లో ఇన్‌స్పెక్టర్, బిగ్ టివి రిపోర్టర్‌ల శరీరం, దుస్తులపై సానుకూల ఫలితాలు వచ్చాయని ఏసీబీ అధికారులు వివరించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పేర్కొన్నారు.

* **ఫిర్యాదు చేస్తే పట్టుకుంటాం: వై. రమేశ్, ఏ సి బి డీఎస్పీ, ఖమ్మం**

ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగిన సందర్భంలో, చట్టం ప్రకారం చర్య తీసుకోవడానికి ప్రజలు ఏసీబీ యొక్క టోల్ ఫ్రీ నంబర్ 1064 ను సంప్రదించాలని ఏసీబీ ఖమ్మం డిఎస్పీ వై రమేష్ అభ్యర్థించారు. అదే విధంగా వాట్సప్ నెంబర్ 9440446106 లేదా ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చునని కోరారు.

* **వరుస దాడులతో అవినీతి అధికారుల్లో వణుకు..**

ఏసీబీ అధికారులు జిల్లాలో వరుస దాడులు నిర్వహించి ముఖ్యంగా పోలీస్ శాఖాధికారులను సైతం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని జైలుకు తరలిస్తున్న ఘటనలతో జిల్లాలోని అవినీతి అధికారుల్లో వణుకు మొదలైంది. ప్రజలకు అండగా ఉండాల్సిన పోలీస్ శాఖలోనే అవినీతి ఈ రకంగా ఉంటే ఇక మిగతా శాఖల్లో పరిస్థితి ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తరువాత ఏసీబీ వలకు చిక్కే ఆ చేప లేదా తిమింగలం ఎవరు అనేదానిపై జిల్లా ప్రజలు , ప్రభుత్వ అధికారుల్లో చర్చనీయాంశంగా మారింది.

## శ్రీ చైతన్య విద్యార్థుల జైతయాత్ర

* **జేఇఇ - మెయిన్స్ ఫలితాలలో సత్తా చాటిన కూకట్ పల్లి బ్రాంచ్ విద్యార్థులు**



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : చైతన్య విద్యా సంస్థ మరొసారి తన విజయ ఢంకా మోగించింది. 41 సంవత్సరాల సుధీర్ఘ అనుభవంతో ఎంతో మంది యువ శాస్త్ర వేత్తలను తయారు చేసి ఆసియా ఖండంలోనే అగ్రగామిగా వెలుగొందుతున్న ఈ విద్యా సంస్థ తాజాగా విడుదలైన జేఇఇ మెయిన్స్ ఫలితాలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి తమ సత్తా చాటుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య కూకట్ పల్లి జోన్ ప్రతినిధులు మాట్లాడుతూ తమ విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలను నిజం చేస్తూ వారిని విజయపథం వైపు నడిపించిన తమ విద్యార్థులకు అంకిత భావంతో పని చేసిన అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బందికి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. కూకట్ పల్లి బ్రాంచ్ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఏకంగా 1000 లోపు 6 ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి సంచలనం సృషించారు. 48, 120, 143, 463, 494, 685 ర్యాంకులతో తమ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నారు. అంతే కాకుండా 5000 లోపు కూడా 23 ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి తమ ప్రత్యేకతను చాటుకున్నారని తెలిపారు. ఇప్పటికే 300 మందికి పైగా విద్యార్థులు జేఇఇ అడ్వాన్స్ట్ పరిక్షకు అర్హత సాధించడం విశేషమని అన్నారు. ఈ అద్భుత విజయానికి కారకులైన విద్యార్థులకు వారి తల్లి దండ్రులకు నిరంతరం శ్రమించిన అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి , సహకరించిన యజమాన్యానికి అలాగే ప్రతిభావంతులైన విద్యార్థులను అందించిన మార్కెటింగ్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి పేదల ఇంట్లో భోజనాలు చేయాలీ

* **టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు**



రాజపేట, ప్రజా స్ఫూర్తి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రాజపేట మండలంలో కాల్వల ద్వారా వండిన వరి పంట బియ్యం తో భోజనాలు చేస్తే రైతులు మండల ప్రజలు సంతోషిస్తారని టిఆర్ఎస్ రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేశ ఎద్దేవా చేశారు. సోమవారం రాజపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కళ్యాణ లక్ష్మి ద్వారా తులం బంగారం అందజేసిన పేదింటి ఆడపిల్ల ఇంట్లో భోజనం చేయాలని, పూర్తి రుణమాఫీ చేసిన గ్రామాలలో భోజనం చేస్తే బాగుంటుందని, ఆడపిల్లలకు స్కూటీ ఇచ్చిన ఇంటికి వెళ్లి వారితో కలసి భుజించాలని తిరుమలేష్ అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి భోజన కార్యక్రమం చేపడితే తాము కూడా తప్పకుండా పాల్గొంటామని రాజపేట మండల టిఆర్ఎస్ పార్టీ పక్షాన తిరుమలేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజపేట పట్టణ శాఖ అధ్యక్షులు వివిధ వీరేశం, రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, మండల పార్టీ సెక్రటరీ జనరల్ సంధిలా భాస్కర్ గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు ఎర్రగోకుల జశ్వంత్, బిల్ల కుదురురాజు, ఉల్లి రమేష్ గౌడ్, గుంటి కృష్ణ, నర్సింలు నాయక్, అంకతి సుదర్శన్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు గవ్వల నర్సింలు తదితరులున్నారు.

## భూభారతి చట్టం అమలుతో రైతుల సమస్యలన్నీ పరిష్కారం

* **ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ధరణి ని బంగాళాఖాతంలో కలిపి ప్రవేశపెట్టనున్న భూభారతి చట్టం రైతులకు చట్టంగా వారి భూములకు కంచెగా మారుతూ భూ బకాసురుల గుండెల్లో గుబులు పుట్టించే విధంగా ఉంటుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం రాజాపేట లో తహసిల్దార్ ఇంద్రాకర్ అనిత ఆధ్వర్యంలో ఆర్డీవో కృష్ణారెడ్డి అధ్యక్షతన రైతులకు ప్రజలకు భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొని మాట్లాడారు. రైతులకు, పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలబడుతుందని, భూమిపై సర్వహక్కులకు యజమాని ఉండేలా భూభారతి చట్టం రూపొందించింది అన్నారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ భూభారతి చట్టంలోని నియమాలను స్పష్టంగా వివరించారు. తన 25 సంవత్సరాల సర్వీసులో ఇంత మంచి చట్టాన్ని చూడలేదని భూభారతి చట్టం అద్భుత చట్టంగా వర్ణించారు. అందరికీ అర్థమయ్యేలా నియమాలు ఉన్నాయని ఆయన చెప్పారు. రైతులు గౌటే లక్ష్మణ్, వెంకటేశం, జూకంటి ప్రవీణ్, బుడిగ పెంటయ్యలు భూభారతి చట్టం అంశాలను కొనియాడుతూ పలు సమస్యలను దృష్టికి తీసుకొచ్చి కొత్త చట్టంలో పొందుపరచాలని కోరారు. అంతకుముందు జానపదాల ద్వారా భూభారత్ చట్టాన్ని జహంగీర్ బృందం వివరించారు. కార్యక్రమానికి ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. భూభారతి చట్టం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి సందే శాన్ని, తెలంగాణ జాతీయ గీతాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ శాంతి నిర్మల, తహసీల్దార్ ఇంద్రాకర్ అనిత, ఏవో పద్మజ, మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సిల్వేరు బాలరాజు గౌడ్, మాడోత్ విఠల్ నాయక్, ఎంపీట ఆవుల కిషన్, నాయబ్ తహసిల్దార్ వెంకటేశ్వర్లు రెడ్డి, ఆర్ఐ రమేష్, నర్సింలు, పిఎసిఎస్ డైరెక్టర్లు, రైతులు బుడిగ పెంటయ్య, కళ్లెం పాండు, బొంతు సుధాకర్, భీమగాని బాల నరసయ్య, ఇంజ నరేష్, రాంజీ నాయక్, పాండవుల బసవరాజ్ గౌడ్, బల్ల యాదేశ్, అంకతి బాలయ్య, రాజపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐరేని నవీన్ కుమార్, రావుల హరిబాబు, కళ్లెం పాండు గౌడ్, రఘునాథపురం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు రమేష్, రేగు సిద్ధులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదిక పైన పాల్గొన్న వారందరికీ రైతు కండువాలతో సత్కరించారు. తహ సిల్దార్ ఇంద్రాకర్ అనిత ప్రత్యేక చిత్రపటాన్ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేతుల మీదుగా ఆవిష్కరింపజేసి బహూకరించారు. వ్యాఖ్యాతగా ప్రముఖ కవి పోరెడ్డి రంగయ్య వ్యవహరించారు. కార్యక్రమం పూర్తి స్థాయిలో విజయవంతం చేసినందుకు తహసిల్దార్ ఇంద్రాకర్ అనిత, రెవెన్యూ సిబ్బందిని జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అభినందించి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమం మామిడి తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పండుగ వాతావరణం లో అవగాహన సదస్సును చేపట్టారు.



## మంచినీళ్ళు, డ్రైనేజీ, కరెంట్ సమస్య పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తాం..

* **సిపిఎం పట్టణ కార్యదర్శి లిక్కీ బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ డిమాండ్.**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణంలో హనుమాన్ బస్తీ, బూడిద గడ్డ గాజులరాజమ్ బస్తి ప్రజల కు మంచినీళ్ల సమస్య తీవ్రతరం అవుతుందని, అప్ర కటిత కరెంటు కోతలు ఎక్కువ ఉన్నా యని, క్రమబద్ధీకరణ పట్టాలు ఇవ్వాలని, డ్రైనేజీ పూడికలు తీయాలని తదితర సమస్యలపై పరిష్కారం కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో హనుమాన్ బస్తీ సెంటర్లో ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో బస్తీ నాయకులు గూగులోతు సక్రం అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి లిక్కి బాల్రాజు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ మాట్లాడుతూ బస్తి లలో సమస్యలు పరిష్కరించాలని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందనే చందంగా కిన్నెరసాని నీళ్ళు 10 రోజులకు ఒకసారి వస్తుందని, అప్రకటిత కరెంట్ కోత ఎక్కువగా ఉందని, డ్రైనేజీ పూడికలు తీయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తదితర సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. మూడు బస్తీలలో 76 జీవో ప్రకారం క్రమబద్ధీకరణ పట్టాలు ఇవ్వలేదని వారు పేర్కొన్నారు. ప్రజలకు ఎందుకు ఇవ్వడం లేదు అనేది కూడా సమాధానం చెప్పలేని స్థితిలో అధికారులు ఉన్నారని వారు విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లు అవకతవకలు జరుగుతున్నాయని పారదర్శకత లోపించిందని ఇందిరమ్మ ఇండ్ల పేర్లను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. వితంతు, విక లాంగులు, వృద్ధాప్య పింఛన్లు దర ఖాస్తు చేసుకున్న వారికి ఇవ్వడం లేదన్నారు. ఇస్తున్న పింఛన్లు కూడా చాలా ఆలస్యంగా ఇస్తున్నారని అలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పేదలు ఎలా బ్రతుకుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్ల స్థలాలు లేక ప్రజలు అద్దె ఇళ్లల్లో ఉంటూ చాలీచాలని కూలి బతుకులకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయని ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య జీవితాలు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం వెంటనే అర్హత కలిగిన వారం దరికీ ఇండ్లు ఇందిరమ్మ పథకం పింఛన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్రమబద్ధీకరణ పట్టాల వెబ్సైట్ ఓపెన్ చేసి పెండింగ్లో ఉన్న సమస్య పరిష్కరించాలని వారు కోరారు. బస్తీలో ఉన్న స్థానిక సమస్యలు పరిష్కరించకపోతే పోరా టాలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు సూరం ఐలయ్య, భూక్యా బాబు, ఎన్ ఎస్ రాజు, గిరి, విజయ్ మోహన్ , రాంబాబు, రాము, చల్ల నరసింహారావు, అల్తాఫ్, సునీల్, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

## బస్తీలో అక్రమంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను తొలగించాలి

* **పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : పాపిరెడ్డి నగర్ బస్తీలో అక్రమంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను తొలగించాలని పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం కూకట్పల్లి మండల తాసిల్దార్ కార్యాలయంలో అదేవిధంగా కూకట్పల్లి సర్కిల్ కార్యాలయంలోని ప్రజావాణిలో బస్తీ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి అధికారులకు వినతి అందిస్తూ అక్రమ వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పాపిరెడ్డి నగర్ బస్తీలో అక్రమంగా వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి నిత్యం లక్షల లీటర్లను తోడేస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు బస్తీలో నీటి ఎద్దడి తలెత్తడంతో పాపిరెడ్డి నగర్ బస్తీ వాసులందరూ ఏకతాటిపైకి వచ్చి వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ గతంలో నిరసనలు సైతం చేపట్టారు ప్లాంట్ల నిర్వాహకులకు కనీసం కనువిప్పు సైతం కాకపోవడంతో సోమవారం వివిధ విభాగాల అధికారులకు పెద్ద ఎత్తున బస్తివాసులందరూ తరలి వెళ్లి చంద్రారెడ్డి సమక్షంలో వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ వినతి పత్రాలు అందించి విజ్ఞప్తి చేశారు కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ బస్తీ వాసులు సంక్షేమ సంఘం ఆలయ కమిటీ సంఘం ఇతర నేతలు బస్తి మహిళలు అత్యధికంగా పాల్గొన్నారు

## ప్రజలు అందించే వినతులను తక్షణమే స్పందించి పరిష్కరించాలి

* **మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (106) ఫిర్యాదులు అందాయన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను డిఆర్ఓ హరిప్రియ తో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా, ఏఐ పై అప్రమత్తంగా ఉండాలి

* **త్వరలో హైదరాబాదులో జాతీయ సదస్సు**
* **అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్ కార్డులు జారీ**
* **తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి**

హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : మీడియా భవిష్యత్ కు ప్రశ్నార్థకంగా సోషల్ మీడియా, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ పట్ల అప్రమత్తంగా ఉండాలని, దీనిపై త్వరలో హైదరాబాదులో జాతీయస్థాయి వర్క్ షాప్ ను నిర్వహిస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం నాగర్ కర్నూలు జిల్లా సోమశిలలో రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ అధ్యక్షతన జరిగిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ మూలంగా భవిష్యత్తులో మీడియా రంగంలో మ్యాన్ పవర్ లేకుండా చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కల్పితాలతో ఏఐ సమాజాన్ని తప్పుదోవ పట్టించే ప్రమాదం పొంచి ఉందని, దీనిపై జర్నలిస్టులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.




సోషల్ మీడియా విప్లవం భావ ప్రకటన స్వేచ్ఛకు మంచి వేదిక అయినప్పటికీ దానిని అడ్డుపెట్టుకొని కొన్ని శక్తులు అలజడి సృష్టించడం సహించరానిది అన్నారు. రాజ్యాంగం భావ ప్రకటన స్వేచ్ఛ కల్పించిందే కానీ ఇతరుల స్వేచ్ఛను హరించే హక్కు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం రూపొందించిన అక్రిడిటేషన్ జీవో అప్రజాస్వామికంగా ఉందని కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఆ జీవను రద్దు చేస్తూ గదా అక్టోబర్ మాసంలో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో కొత్త మార్గదర్శకాలు రూపొందించేందుకు కమిటీ వేశామని , అంతేకాకుండా ఆ కమిటీ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందన్నారు. త్వరలో దీనికి సంబంధించిన జీవో విడుదల కాను ఉందని ఆయన స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల విషయంలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఎవరు నమ్మవద్దని, ఈ విషయమై ఎవరు ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు అవుతాయని ఆయన తెలిపారు. అక్రిడిటేషన్ కమిటీలను కూడా త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు.

### * ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

ఉద్యమాలతోనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఐజేయు స్టీరింగ్ కమిటీ మెంబర్ దేవులపల్లి అమర్ అన్నారు. ప్రభుత్వాలు ఏవైనా జర్నలిస్టుల పక్షపాతిగా, జర్నలిస్టుల సంక్షేమం కోసం గత 65 ఏళ్లుగా పోరాడుతున్న చరిత్ర తమ సంఘానికే ఉందని అన్నారు. సంఘ నాయకులకు ప్రభుత్వ పదవులు వచ్చినంత మాత్రాన, సంఘ ప్రయోజనాల కోసం కాదని ఆ పదవుల బాధ్యతలు వేరుగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

### * టీయూడబ్ల్యూజే ఐజేయు ఏ ప్రభుత్వానికి, ఏ పార్టీకి అనుకూలం కాదు

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఏ ప్రభుత్వానికి, ఏ పార్టీకి అనుకూలం కాదని, జర్నలిస్టుల సంక్షేమమే ఏకైక లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ స్పష్టం చేశారు. జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఇండ్లు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు, ఉచిత విద్య తదితర సమస్యలపై ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. తమ సంఘం వినతి మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మెడికవర్ ఆసుపత్రుల్లో ఉండే ఆర్థోపెడిక్, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులకు హెల్త్ కార్డులపై చికిత్స చేసేందుకు ఆసుపత్రి యాజమాన్యం నిర్ణయించడం అభినందనీయమని అన్నారు. గత కార్యవర్గ సమావేశం అనంతరం చేపట్టిన కార్యకలాపాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామనారాయణ నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర మంత్రులందరికీ యుద్ధ ప్రాతిపదికన వినతి పత్రాలు అందించాలన్నారు. సంఘ సంస్థాగత కార్యకలాపాలను మరింత పటిష్టం చేయడానికి రాష్ట్ర బాధ్యులను జిల్లా ఇన్చార్జిలుగా నియమించాలని కార్యవర్గం నిర్ణయించింది. టీయూడబ్ల్యూజే (ఐజేయు)కు అనుబంధంగా ఉన్న ప్రెస్ క్లబ్ ల కార్యకలాపాలను పరిశీలించేందుకు గాను ఆరుగురు సీనియర్లతో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఐజేయూ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కే రాములు, ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్ గౌడ్, గాడిపల్లి మధు గౌడ్, ఫైసల్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శులు గుండ్రాతి మధుగౌడ్, వరకాల యాదగిరి, కే శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి మోతే వెంకటరెడ్డి తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు హాజరయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించిన నాగర్ కర్నూల్ జిల్లా శాఖను రాష్ట్ర కార్యవర్గం అభినందించారు.


## రూ.లక్షల్లో లంచం..
# ఏసీబీకి చిక్కిన అధికారులు

హైదరాబాద్: తెలంగాణలో లంచం తీసుకుంటూ పలువురు ప్రభుత్వ అధికారులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కారు. మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారం మున్సిపల్ కార్యాలయం డీఈఈ సుదర్శనం రఘు రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఆయనతోపాటు మరో ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది రాకేశ్, సురేశ్‌లను కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సీసీ రోడ్డు నిర్మాణం బిల్లుల మంజూరు కోసం రఘు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. కార్యాలయంలో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. మరోవైపు భద్రాద్రి జిల్లా మణుగూరు సీఐ సతీశ్ ఏసీబీ వలలో చిక్కాడు. ఓ కేసు పరిష్కారం నిమిత్తం రూ. లక్ష లంచం తీసుకుంటుండగా.. సీఐ సతీశ్, మధ్యవర్తి గోపిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. జనగామ జిల్లాలో ఆర్ఐ వినీత్‌కుమార్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. చిల్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో రూ.26వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనపై అధికారులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నారు.

## పౌరసత్వం కేసు.. ఆది శ్రీనివాస్‌కు
# రూ.25లక్షలు అందజేసిన చెన్నమనేని రమేశ్



హైదరాబాద్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ హైకోర్టులో రూ.25లక్షల డీడీ అందజేశారు. చెన్నమనేని పౌరసత్వంపై గతంలో ఆది శ్రీనివాస్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జర్మనీ పౌరసత్వం కలిగి ఉండి తప్పుడు పత్రాలతో ఎన్నికల్లో పోటీ చేశారని.. ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశంపై కోర్టులో ఆది శ్రీనివాస్ సుదీర్ఘ కాలం పోరాడారు. పలు దఫాలుగా విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. చెన్నమనేని రమేశ్‌కు జర్మనీ పౌరసత్వం ఉన్నట్లు తేల్చింది. తప్పుదోవ పట్టించినందుకు ఆయనకు జరిమానా విధించింది. పిటిషనర్ ఆది శ్రీనివాస్‌కు రూ.25లక్షలు, న్యాయసేవాధికార సంస్థకు రూ.5లక్షలు ఇవ్వాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పు మేరకు నేడు ఆ డబ్బును డీడీల రూపంలో చెన్నమనేని రమేశ్ అందజేశారు.



# జపాన్ పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

టోక్యో: జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం ఒసాకో ఎక్స్‌పోలో పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని జపాన్ వ్యాపారవేత్తలను సీఎం ఆహ్వానించారు. నవ ప్రపంచాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉత్తమ పారిశ్రామిక విధానం, ప్రపంచస్థాయి మౌలిక వసతులు ఉన్నాయన్నారు.

## ఒసాకా ఎక్స్‌పోలో తెలంగాణ
# పెట్టుబడులకు సీఎం రేవంత్ పిలుపు

* **జపాన్‌లోని ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో 2025లో పాల్గొన్న తొలి భారత రాష్ట్రంగా తెలంగాణ.**
* **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం పర్యటన**
* **జపాన్ కంపెనీలను తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించిన సీఎం.**
* **ఎక్స్‌పోలో తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్ బాబు.**
* **ఫ్యూచర్ సిటీ, ఆర్ఆర్ఆర్ జోన్, మూసీ అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టుల ప్రస్తావన.**



తెలంగాణ రాష్ట్రానికి అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం జపాన్‌లో పర్యటిస్తోంది. ప్రతిష్ఠాత్మక ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో 2025లో పాల్గొన్న తొలి భారత రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఎక్స్‌పోలోని భారత పెవిలియన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ తెలంగాణ జోన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.ఒసాకా ఎక్స్‌పో వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు గల అపార అవకాశాలను వివరించారు. సులభతర పారిశ్రామిక విధానం, స్థిరమైన ప్రభుత్వం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణకు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. “హైదరాబాద్‌కు రండి, మీ ఉత్పత్తులను ఇక్కడ తయారు చేయండి. భారత మార్కెట్‌తో పాటు ప్రపంచదేశాలకు తెలంగాణను ఉత్పత్తికేంద్రంగా మార్చుకోండి” అంటూ జపాన్ కంపెనీలను సీఎం సాదరంగా ఆహ్వానించారు. తెలంగాణ, జపాన్ మధ్య చారిత్రక స్నేహ బంధాన్ని బలమైన భాగస్వామ్యంగా మార్చుకుందామని, నూతన ఆవిష్కరణలతో భవిష్యత్తుకు బాటలు వేద్దామని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సీఎం వివరించారు. హైదరాబాద్‌లో 30,000 ఎకరాల విస్తీర్ణంలో ‘ఫ్యూచర్ సిటీ’ నిర్మిస్తున్నామని, ఇది పర్యావరణ హితం, ఇంధన సామర్థ్యం, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీకి కేంద్రంగా ఎదుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా జపాన్‌కు చెందిన మరుబెని కార్పొరేషన్‌తో కలిసి ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ చుట్టూ నిర్మిస్తున్న 370 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ఔటర్ రింగ్ రోడ్ మధ్య ప్రాంతంలో ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్ పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎగుమతుల కోసం సమీప ఓడరేవుతో అనుసంధానించే డ్రై పోర్టును కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మూసీ నది పునరుజ్జీవనంలో భాగంగా 55 కిలోమీటర్ల మేర అర్బన్ గ్రీన్ వే అభివృద్ధికి టోక్యో, ఒసాకా నగరాల అనుభవాలు స్ఫూర్తినిస్తాయని అభిప్రాయపడ్డారు.మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఐటీ, బయోటెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే తనదైన ముద్ర వేసిందని, ఇప్పుడు ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్ వంటి రంగాల్లోనూ పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ జయేశ్ రంజన్ మాట్లాడుతూ, యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ‘యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ’ని ఏర్పాటు చేశామని, ఇది ఉపాధి, వ్యాపార అవకాశాలను పెంచుతుందని అన్నారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరిగే ఒసాకా ఎక్స్‌పోలో తెలంగాణ పెవిలియన్ ద్వారా రాష్ట్ర సాంస్కృతిక వైభవం, పర్యాటక ఆకర్షణలు, పారిశ్రామిక ప్రగతిని ప్రపంచానికి పరిచయం చేయనున్నారు. ఈ వేదిక ద్వారా పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు, సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన భారాస నేత మన్నె క్రిశాంక్



హైదరాబాద్: భారాస నేత మన్నె క్రిశాంక్ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో విచారణ పేరుతో వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ‘‘ఈ కేసు విషయంలో ఇప్పటికే మూడు సార్లు విచారణకు పిలిచారు. ఈ నెల 23న విచారణకు రావాలని పోలీసులు నోటీసులు ఇచ్చారు. దర్యాప్తు పేరుతో ఏమీ విచారించకుండా సమయం వృథా చేస్తున్నారు. హక్కులకు భంగం కలిగిస్తున్న గచ్చిబౌలి పోలీసులపై చర్యలు తీసుకోవాలి. విచారణ నిలిపివేసేలా పోలీసులను ఆదేశించాలి’’అని పేర్కొన్నారు.



# కీరా తిందాం... చల్లగా ఉందాం!

**ఎండలో కాస్త నిలబడ్డామంటే సూర్యుడు స్ట్రా వేసుకుని మన శక్తినంతటినీ జుర్రేసుకున్నట్టుగా ఉంటుంది. ఏ కాస్త వేడిగాలులు తగిలినా ఒంట్లోని నీరంతా పోయి శరీరం మొత్తం డీహైడ్రేట్ అయిపోతుంది. మరైతే ఆ నిస్సత్తువను దూరం చేసుకోవాలంటే- వేడిని తరిమికొట్టే ఆహారపదార్థాలు తప్పకుండా తినాల్సిందే. అందులో అన్నింటికన్నా ముందు వరుసలో ఉంటుంది మనకు సుపరిచితమైన కీరా దోస. ఎండల్లో దాహాన్ని తీర్చే ఈ కీరాలో ఏమేం పోషకాలున్నాయో... అది ఆరోగ్యానికి ఎంతెంత అవసరమో... తెలుసుకున్నారంటే ఈసారి సమ్మర్ స్నాక్స్‌లో ఇదీ ఉంటుందంతే!**



'కూల్ యాజ్ ఏ కుకుంబర్'... ఎలాంటి ఒత్తిడిలోనైనా ప్రశాంతంగా ఉండే వాళ్ల గురించి చెప్పేటప్పుడు వాడే ఈ నానుడిని ఎప్పుడైనా విన్నారా? చల్లదనానికి చిరునామా అయిన కీరా దోసకాయ ప్రత్యేకత వల్లే ఆ మాట వచ్చినట్టుంది. చూడగానే గుర్తొచ్చే దీని ఆ చలువ లక్షణం వల్ల కొంతమంది కీరా ముక్కలతోనే అల్పాహారాన్ని మొదలుపెడితే మరికొందరు రైతా, శాండ్‌విచ్, సోడా, జ్యూసుల్లానూ ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. పిల్లలు, పెద్దలకే కాదు, రకరకాల డైటింగులు చేసేవారికీ ఎన్నో ప్రయోజనాలు అందించే కీరా గురించి ఇంకా చాలా విశేషాలే ఉన్నాయి.

మనమైతే దీన్నీ కూరగాయల్లో ఒకటిగా కలిపేసుకుంటాం కానీ నిజానికి ఇది ఒక పండు. కాయగా ఉన్నప్పుడే కోసుకుంటాం కాబట్టి వెజిటబుల్స్‌లోనే స్థానం ఇచ్చుండొచ్చు. ఇంకా మామూలుగా కీరాలో గ్రీన్ కుకుంబర్‌నే ఎక్కువగా చూస్తుంటామా... కానీ ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న ఈ కీరా దోసకాయల్లో బోలెడన్ని రకాలూ ఉన్నాయి, కొత్తకొత్త వెరైటీలూ వచ్చేస్తున్నాయి. అవేంటంటే...

*** ఎన్ని రకాలో...**

పొడుగ్గా, తెల్లగా ఉండే స్నేక్ కుకుంబర్‌ని మన దగ్గరా సాగు చేస్తుంటారు. పలుచని తోలుతో ఉండే ఇది రూపంలో కాస్త భిన్నంగా ఉంటుంది కానీ దీని రుచి మాత్రం అచ్చం గ్రీన్ కీరాదే. ఇంకా దీంట్లోనే గీతలతో ఉండే స్ట్రైప్డ్ కుకుంబర్, మూడు అడుగుల పొడవు ఉండే అర్మేనియన్ కుకుంబర్ కూడా ఉన్నాయి. ముదురు ఆకుపచ్చ రంగులో పలుచని తోలుతో ఉండే ఇంగ్లిష్ కీరాలో గింజలు కనిపించవు. అంతేకాదు... మన దగ్గర ప్రత్యేకంగా కొన్ని ప్రాంతాల్లోనే సాగు చేసే కీరా వెరైటీలూ చాలానే ఉన్నాయి. పుణెలో పండించే తియ్యటి గోల్డెన్ ఎల్లో కీరాని సలాడ్లలో, శాండ్‌విచ్‌లలో ఎక్కువగా వాడుతుంటారు. ప్రత్యేకంగా ఎరుపు రంగు తోలుతో లావోస్‌లో రెడ్ మాంగ్ కీరా రకాన్ని సృష్టించారు. వీటితోపాటు గుండ్రని రకాలూ ఉన్నాయి. పసుపు రంగులో నిమ్మకాయంత సైజు ఉండే లెమన్ కీరా గార్నిషింగ్‌కి మంచి ఛాయిస్ అవుతుంది. ఇంకా వేలెడంత సైజులోని బేబీ కీరా ఇప్పుడు అన్నిరకాల ఆన్‌లైన్ గ్రాసరీ స్టోర్లలోనూ దొరుకుతోంది. దొండకాయంత పరిమాణంలో ఉండే డిజర్ట్ కుకుంబర్ తియ్యగా, పుల్లగా భలేగా ఉంటుందట! రూపంలో, రంగులో కాస్త తేడాగా కనిపించినా ఈ కీరాదోస రకాలతో వచ్చే లాభాలు మాత్రం ఒకటే!





*** ఉత్పత్తుల్లోనూ...**

కీరా దోసకాయ ముక్కల్ని తినడం నచ్చకపోతే దీంతో వస్తున్న చిప్స్, సిరప్స్, జ్యూసులు ఇంకా పొడుల్ని ట్రై చేయొచ్చు. మార్కెట్లో రకరకాల రెడీమేడ్ కీరా ఉత్పత్తులు దొరుకుతున్నాయి. చర్మానికి సహజమైన సౌందర్యలేపనంగా చెప్పే కీరాని బ్యూటీ ట్రీట్‌మెంట్లలోనూ ఉపయోగిస్తుంటారు. ఫేస్‌ప్యాక్‌ల దగ్గర్నుంచి సబ్బు, షాంపూల వరకూ బోలెడన్ని ఉత్పత్తులూ వచ్చేశాయి! పెట్టుకుని తినే రెండు మూడు కీరా ముక్కలతోనే మనకెన్ని లాభాలు ఉన్నాయో! ఇక నుంచైనా, ఏ పెళ్లి భోజనాల్లోనో కనిపిస్తే మాత్రమే నోట్లో పెట్టుకోకుండా రోజూ తప్పకుండా తినండి. ఎండల్లో ఎక్కడికైనా వెళుతూ పట్టుకెళ్లే వాటిలో వాటర్‌బాటిల్‌తోపాటూ ఈ కీరా దోసకీ కాస్త చోటు ఇచ్చేశారంటే... అవసరమైనప్పుడు దాహాన్నీ తీరుస్తుంది, పొట్టనీ నింపుతుంది... ఏమంటారు!?

## ఎంత ఆరోగ్యమో...

- **దాదాపు 95 శాతం నీటితోనే ఉండే కీరా దోసకాయ... శరీరానికి కావాల్సిన నీటిని అందిస్తుంది. ఉష్ణోగ్రతనూ నియంత్రిస్తుంది.**
- **దీన్ని పోషకాల గనిగానూ చెప్పొచ్చు. బీ, సీ విటమిన్లూ, పొటాషియం, మెగ్నీషియం లాంటి ఖనిజాలూ ఇందులో అధికమే.**
- **బరువు తగ్గాలనుకునేవారు రోజూ కీరాని తినొచ్చు. క్యాలరీలు, పిండి పదార్థాలు, చక్కెర తక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గడంలో తోడ్పడుతుంది.**
- **అధిక పీచుతో ఉండే కీరా దోస జీర్ణవ్యవస్థ పనితీరుకు మేలు చేస్తుంది. ఉదర సంబంధ వ్యాధుల్నీ, మలబద్ధకాన్నీ తగ్గిస్తుంది.**
- **శరీరంలోని ఇన్సులిన్ స్థాయిల్ని నియంత్రిస్తూ ఇది మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. ఎక్కువసార్లు మూత్రవిసర్జన చేయడం వల్ల డీహైడ్రేట్ అయ్యే మధుమేహులకు దీని వల్ల ఎంతో లాభం.**
- **మెదడును ఆరోగ్యంగా ఉంచుతూ వయసుతోపాటు వచ్చే మతిమరుపు నుంచీ ఇది కాపాడుతుంది.**
- **దీంట్లోని యాంటీ ఆక్సిడెంట్లు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షిస్తాయి. క్యాన్సర్ కణాలు వృద్ధి చెందకుండా చూడటంతోపాటు ఆ కణాల నిర్మూలనకూ కీరా ఉపయోగపడుతుంది.**
- **సోడియం ఎక్కువైతే రక్తపోటు పెరుగుతుంది, పొటాషియం దీని ప్రభావాన్ని తగ్గిస్తూ రక్తపోటు పెరగకుండా చూస్తుంది. కీరాలో సోడియం తక్కువగా ఉండటం, పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల రెండు రకాలుగా మేలు చేస్తుందన్నమాట. ఇంకా ఇది కొలెస్ట్రాల్ మోతాదులనూ తగ్గిస్తుంది.**
- **కీరాలో ఎక్కువగా ఉండే కె-విటమిన్ మనం తీసుకున్న ఆహారం నుంచి శరీరం ఎక్కువ మొత్తంలో కాల్షియం గ్రహించేలా చేస్తుంది. తద్వారా ఎముకలు దృఢంగా తయారవుతాయి.**
- **నోటి దుర్వాసనను పోగొట్టి తాజా శ్వాసను అందించడంలో కీరా దోస బాగా పనిచేస్తుంది. ఇంకా మూత్రపిండాల్లోనూ, మూత్రాశయంలోనూ ఉన్న రాళ్లను కరిగిస్తుందిది.**
- **కీరా దోస శరీరంలోని వ్యర్థాల్ని తొలగించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఒత్తిడి, ఆందోళనల్ని తగ్గించడంలోనూ ఇది ముందే ఉంటుంది.**
- **దీంట్లోని సిలికా, ఇతర ఖనిజాలు... చర్మాన్నీ, గోళ్లనీ, జుట్టునీ ఆరోగ్యంగా**





# బిజినెస్
BUSINESS

## రూ.500 నోట్లతో జాగ్రత్త.. : హోంశాఖ హెచ్చరికలు



అత్యాధునిక టెక్నాలజీ వాడి తయారుచేసిన రూ.500 దొంగనోట్లు చెలామణిలోకి వచ్చినట్లు కేంద్ర హోంశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ఈ సమాచారాన్ని డీఆర్ఐ, ఎఫ్ఐయూ, సీబీఐ, ఎన్ఐఏ, సెబీతో కూడా పంచుకొంది. ఆ దొంగనోట్ల ప్రింటింగ్, నాణ్యత చాలావరకు అసలు నోట్లులాగే ఉన్నట్లు వెల్లడించింది. వాటిని గుర్తించడం కూడా చాలా క్లిష్టంగా మారిందని వెల్లడించింది. కాకపోతే ఈ నోట్లలో ఒక చిన్న స్పెల్లింగ్ తప్పు ఉందని.. దీనిని గుర్తించడంలో అదే కీలకమని పేర్కొంది. "RESERVE BANK OF INDIA" అనే దానిలో ''RESERVE'' పదంలో 'E' బదులు 'A' పడినట్లు వెల్లడించింది. ఈ చిన్న తప్పును గుర్తించాలంటే ఆ నోటును క్షుణ్ణంగా పరీక్షించాల్సి ఉంటుంది. ఇలాంటి నకిలీ నోట్లు అత్యంత ప్రమాదకరమని వెల్లడించింది. వీటి విషయంలో ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, ఏజెన్సీలను అప్రమత్తంగా ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఇవి మార్కెట్లో ఉన్నాయని హెచ్చరించారు. మార్కెట్లో మొత్తం ఎన్ని ఉన్నాయో గుర్తించడం కష్టమని ఉగ్ర ఫైనాన్స్‌పై దర్యాప్తు చేస్తున్న ఓ అధికారి చెప్పారు. ప్రజలు, వ్యాపార సంస్థలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.




## 'థాంక్యూ', 'ప్లీజ్'.. చాట్‌జీపీటీలో చాలా కాస్ట్‌లీ గురూ..! ఆల్ట్‌మన్ ఆసక్తికర వ్యాఖ్యలు

ఓపెన్‌ఏఐకి చెందిన ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. రోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ సేవల్ని వినియోగిస్తున్నారు. దీంతో కొత్త మోడళ్లు, అద్భుతమైన ఫీచర్లతో ఓపెన్‌ఏఐ ముందుకొస్తోంది. అయితే ఈ చాట్‌బాట్ గురించి కంపెనీ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ తాజాగా ఓ ఆసక్తికరమైన విషయం పంచుకున్నారు. ఒక్కో ఏఐ సర్వీసును రోజంతా అందించేందుకు రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నట్లు ఇప్పటికే తెలిపిన ఆయన.. యూజర్లకు ఇచ్చే మర్యాదకు కూడా పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. చాట్‌జీపీటీతో సంభాషించే సమయంలో 'థాంక్యూ', 'ప్లీజ్' వంటి పదాలు వినియోగిస్తుంటాం. ఇలాంటి పద బంధాలను చెప్పడం వల్ల సిస్టమ్‌లపై అదనపు ఒత్తిడి పెరుగుతోందట. ఈ పదాలకు మళ్లీ బదులు చెప్పడానికి కంపెనీకి మిలియన్ డాలర్ల ఖర్చవుతోందని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ స్వయంగా వెల్లడించారు. ''థాంక్యూ, ప్లీజ్ వంటి పదాలు చెప్పేందుకు ఓపెన్‌ఏఐ పెద్ద మొత్తంలో ఖర్చు చేయడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది'' అని ఓ యూజర్ 'ఎక్స్' వేదికగా చేసిన పోస్ట్‌కు ఆల్ట్‌మన్ సమాధానం ఇచ్చారు. చాట్‌బాట్‌తో సంభాషించే యూజర్లలో మర్యాదను ప్రోత్సహించడానికి పది మిలియన్ డాలర్లు ఖర్చు చేశామని తెలిపారు. ఆల్ట్‌మన్ సమాధానంతో నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ఈ సమాధానం నెట్టింట వైరల్‌గా మారుతోంది.

## పసిడి సరికొత్త రికార్డ్..
# 10 గ్రాములు @ ₹1,00,000



బంగారం సరికొత్త రికార్డును నమోదు చేసింది. 10 గ్రాముల మేలిమి పసిడి ధర అక్షరాలా లక్ష రూపాయలకు (పన్నులతో కలిపి) చేరింది. దేశంలో పసిడి ధర ఈ స్థాయిని అందుకోవడం ఇదే తొలిసారి. అమెరికా, చైనా మధ్య వాణిజ్య పోరు, డాలర్ బలహీన పడడం వంటి కారణాలతో మదుపర్లు బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ విపణిలో ఔన్సు పసిడి సోమవారం 3,405 డాలర్లకు చేరింది. దీన్ని అనుసరించి దేశీయంగా లక్ష రూపాయల మార్కును అందుకుంది. సాయంత్రం 5.30 గంటల సమయానికి 24 క్యారెట్ల పసిడి రూ.1,00,016కు చేరింది. ఆపై కాస్త దిగి వచ్చి రూ.99,900 వద్ద ట్రేడవుతోంది. శుక్రవారం ముగింపుతో పోలిస్తే దాదాపు రూ.2 వేలు పెరిగింది. ఈ ఏడాది ఇప్పటి వరకు బంగారం ధర దాదాపు రూ.20 వేలకు పైనే పెరగడం గమనార్హం. డిసెంబర్ 31న సుమారు రూ.79 వేలు ఉన్న పసిడి ధర.. గడిచిన మూడున్నర నెలల్లో 26 శాతం మేర పెరిగింది. అటు వెండి ధర సైతం కిలో మళ్లీ రూ.లక్షకు చేరువవుతోంది. గతంలో ఓసారి లక్ష మార్కును దాటిన వెండి.. ప్రస్తుతం రూ.99,299 పలుకుతోంది. అటు మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలోనూ 10 గ్రాముల పసిడి తొలిసారి రూ.96 వేల మార్కు దాటింది. జూన్ నెల డెలివరీ కాంట్రాక్ట్‌లో 10 గ్రాముల పసిడి ఒక్క రోజులోనే రూ.1621 మేర పెరిగి ఇంట్రాడేలో రూ.96,875 వద్ద గరిష్ఠాన్ని తాకింది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా చైనాల మధ్య వాణిజ్యం విషయంలో సయోధ్య కుదిరేంతవరకు ఇదే పరిస్థితి కొనసాగొచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు.



### 7000mAh బ్యాటరీతో ఒప్పో K13..
## గంటలోనే బ్యాటరీ ఫుల్

చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ ఒప్పో k13 5జీ (Oppo K13 5G) స్మార్ట్‌ఫోన్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. గతేడాది విడుదలైన K12కు కొనసాగింపుగా ఈ ఫోన్‌ను కంపెనీ తీసుకొచ్చింది. బిగ్ బ్యాటరీ, ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో ఈ ఫోన్ వస్తోంది. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.. ఒప్పో K13 5జీ స్మార్ట్‌ఫోన్‌లో 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీ+ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. ఇది 120Hz రిఫ్రెష రేటుకు, 1200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌కు సపోర్ట్ చేస్తుంది. ఆండ్రాయిడ్ 15తో కూడిన కలర్ ఓఎస్ 15తో వస్తోంది. వెట్ టచ్, గ్లోవ్ మోడ్ ఉన్నాయి. ఈ ఫోన్ స్నాప్‌డ్రాగన్ 6జనరేషన్ 4 ప్రాసెసర్‌తో వస్తోంది. వెనుకవైపు 50 ఎంపీ కెమెరా, 2 ఎంపీ సెకండరీ కెమెరా ఉన్నాయి. ముందు వైపు 16 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. ఏఐ క్లారిటీ ఎన్‌హ్యాన్సర్, ఏఐ రిఫ్లెక్షన్ రిమూవర్, ఏఐ అన్‌బ్లర్, ఏఐ ఎరేజర్ 2.0 వంటి ఏఐ ఫీచర్లతో వస్తోంది. ఐఆర్ రిమోట్ కంట్రోల్ ఆప్షన్, డ్యూయల్ స్టీరియో స్పీకర్ సదుపాయాలు ఉన్నాయి. ఇందులో 7000 ఎంఏహెచ్ బ్యాటరీ ఇచ్చారు. 80W ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్‌తో వస్తోంది. 062 శాతం బ్యాటరీని కేవలం 30 నిమిషాల్లో, నూరు శాతం ఛార్జింగ్‌ను 56 నిమిషాల్లో పూర్తి చేయొచ్చని కంపెనీ చెబుతోంది. ఈ ఫోన్ 8.45 ఎంఎం మందం, 208 గ్రాముల బరువుతో వస్తోంది. ధర విషయానికొస్తే.. 8జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ.17,999గా కంపెనీ నిర్ణయించింది. 256 జీబీ వేరియంట్ రూ.19,999కు లభిస్తుంది. పర్పుల్, ప్రిజమ్ బ్లాక్ రంగుల్లో లభ్యమవుతుంది. ఒప్పో, ఫ్లిప్‌కార్ట్ వెబ్‌సైట్లలో ఏప్రిల్ 25 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి.


# టెక్నాలజీ
TECHNOLOGY

## కొత్త ఏటీఎమ్.. ఇలా బంగారం వేస్తే
# అలా డబ్బులొస్తాయ్..



ఏటీఎం గురించి తెలుసా? అని ఎవరినైనా అడిగితే.. అదెందుకు తెలియదు మాకు తెలుసు అనే చాలామంది చెబుతారు. అయితే గోల్డ్ ఏటీఎం గురించి తెలుసా? అని అడిగితే.. అడిగిన వాళ్లనే అనుమానంగా చూస్తారు. బహుశా మీ అనుమానం కరెక్టే కావచ్చు, కానీ అలాంటి ఏటీఎం కూడా ఒకటి వచ్చేసింది. దాని గురించి తెలుసుకోవాలంటే, ఈ కథనం చదివేయాల్సిందే.. చైనాలోని షాంఘైలో బంగారాన్ని కరిగించి, దానికి తగిన డబ్బును అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసే ఏటీఎం మెషిన్ అందుబాటులోకి వచ్చింది. ఇందులో గోల్డ్ వేస్తే.. దాని బరువును, నాణ్యతను బట్టి.. ఆ రోజు మార్కెట్ విలువను బట్టి వినియోగదారుడి బ్యాంక్ ఖాతాకు డబ్బును జమ చేస్తుంది. ఇదంతా కొన్ని నిమిషాల వ్యవధిలోనే జరిగిపోతుంది. ఈ మెషిన్ బంగారాన్ని 1,200 డిగ్రీల సెల్సియస్ వద్ద కరిగిస్తుంది తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియో ఒకటి నెట్టింట్లో వైరల్ అవుతోంది. వీడియోలో గమనించినట్లయితే.. ఒక మహిళ బంగారాన్ని ఏటీఎం మెషిన్‌లో వేసిన తరువాత, ఆ రోజు ధరలను లెక్కగట్టి, బంగారంకు విలువకు తగిన డబ్బును ట్రాన్స్‌ఫర్ చేస్తుంది. ఇదే ప్రపంచంలోని మొట్ట మొదటి గోల్డ్ ఏటీఎం మెషిన్ అని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట్లో వైరల్ అవుతోంది. నెటిజన్లు తమదైన రీతిలో కామెంట్స్ చేస్తూ.. టెక్నాలజీకి ఫిదా అయిపోతున్నారు.

## మూడ్‌కు తగ్గట్టు మ్యూజిక్ వినిపించే స్మార్ట్ లైట్



ఈ ఫొటోలో కనిపిస్తున్న సీలింగ్ లైట్ కేవలం ప్రకాశవంతమైన వెలుగు కోసం మాత్రమే పరిమితమైన లైట్ కాదు. ఎప్పటికప్పుడు మీ మూడ్‌కు తగ్గట్టు సంగీతంతోపాటు, రంగు రంగుల లైట్లతో ఇంటిని పార్టీ థీమ్‌లోకి తీసుకొని వెళ్లగలిగే స్మార్ట్ లైట్. రీఛార్జబుల్ బ్యాటరీతోనూ పనిచేస్తుంది. కాబట్టి, మధ్యలో కరెంట్ పోయినా కూడా పార్టీకి అంతరాయం ఏర్పడదు. మొబైల్ యాప్, గూగుల్ హోమ్, అమెజాన్ అలెక్సాతో అనుసంధానం చేసుకొని వాడుకోవచ్చు. ధర 139 డాలర్లు (రూ. 11,995).

# నెరవేరని చిరకాల కోరిక.. భారత్‌తో పోప్ ఫ్రాన్సిస్ అనుబంధం ఇలా..!

క్యాథలిక్‌ల అత్యున్నత మత గురువు పోప్ ఫ్రాన్సిస్ (88) కన్నుమూసిన విషయం తెలిసిందే. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఇటలీ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. పోప్ మృతిపై ప్రధాని మోదీ సహా అనేక మంది నేతలు, క్రైస్తవ ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. భారత్‌తో ఆయన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటే.. అది పలు సవాళ్లు, ఆశల మిశ్రమంగా సాగింది. మన దేశాన్ని సందర్శించాలనే ఆయన చిరకాల కోరిక మాత్రం నెరవేరకుండానే ఆయన నిష్క్రమించడం బాధాకరం.

**పలువురికి 'సెయింట్' హోదా**

పోప్ ఫ్రాన్సిస్ పలువురు భారత క్యాథలిక్ మతాచార్యులకు సెయింట్‌హుడ్ హోదా కల్పించి.. సంబంధిత విశ్వాసులకు గర్వించదగ్గ క్షణాలను అందించారు. 2014లో ఫాదర్ కురియకోస్ ఎలియాస్ ఛావరా, సిస్టర్ యుఫ్రసియా ఏలువత్తింగల్, 2019లో నన్ మరియం థ్రెసియాకు, 2022లో దేవసహాయం పిళ్లైకు ఈ హోదా ప్రకటించారు. దైవదూతగా గుర్తింపు పొందిన తొలి భారతీయ సామాన్యుడిగా దేవసహాయం చరిత్రలో నిలిచిపోయారు.

**కార్డినల్‌గా జార్జి జాకబ్**

గతేడాది డిసెంబర్‌లో రోమ్‌లోని సెయింట్ పీటర్స్ బసిలికాలో నిర్వహించిన కార్యక్రమంలో.. భారత క్రైస్తవ మతాచార్యుడు జార్జ్ జాకబ్ కువాకడ్‌కు కార్డినల్‌గా




పదోన్నతి కల్పించారు. జార్జి జాకబ్‌కు ఈ హోదాను, దీనికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని ప్రదానం చేశారు. కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ నేతృత్వంలోని ప్రభుత్వ బృందం ఈ కార్యక్రమానికి హాజరైంది. వేడుకకు ముందు పోప్ ఫ్రాన్సిస్‌తో సమావేశమైంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు తదితరులు ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే భారత్‌లో కార్డినల్ హోదా కలిగిన వారి సంఖ్య ఆరుకు పెరిగింది. 2020 నుంచి పోప్ ఫ్రాన్సిస్ అంతర్జాతీయ ప్రయాణాలను జార్జ్ జాకబ్ కువాకడ్ నిర్వహిస్తున్నారు. 2025 అనంతరం ఆయన భారత్‌ను సందర్శించే అవకాశం ఉందని పదోన్నతి సమయంలో ఆయన వెల్లడించారు. అయితే, అంతకుముందు కూడా ఆయన భారత్‌కు వచ్చే అవకాశం లేకపోలేదన్నారు. కానీ, భారత్‌ను సందర్శించకుండానే పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూశారు. పోప్ ఫ్రాన్సిస్ సమయంలోనే.. కేరళలోని సైరో-మలబార్ చర్చికి సంబంధించి ప్రార్థనల నిర్వహణ విధానంపై వివాదం నెలకొంది. చర్చిలో పవిత్ర ప్రార్థనలు ఎలా నిర్వహించాలనే విషయంలో కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరించేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఫ్రాన్సిస్ 1938లో అర్జెంటీనాలో జన్మించారు. దక్షిణ అమెరికా నుంచి ఈ పదవిని అందుకొన్న తొలి వ్యక్తి ఆయనే. ఆయన్ను ప్రజల పోప్ అంటారు. తరచూ సామాజిక అంశాలపైనా ఆయన స్పందిస్తుంటారు. 2016లో రోమ్ బయట ఇతర మతానికి చెందిన శరణార్థుల పాదాలు కడిగారు. దీనిని ఆయన వినయం, సేవాతత్పరతకు చిహ్నంగా భావించారు. కరుణ, మానవత్వం, ఆధ్యాత్మిక ధైర్యానికి ప్రతీకగా ఆయన గుర్తుండిపోతారంటూ ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు.

# ఐఎస్ఎస్‌కు శుభాంశు శుక్లా.. ఏడు ప్రయోగాలు చేయనున్న వ్యోమగామి!




అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేపట్టబోయే యాత్ర కోసం ప్రధాన వ్యోమగామిగా గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. యాక్సియమ్ 4 మిషన్‌లో భాగంగా మే నెలలో ఐఎస్ఎస్‌కు వెళ్లనున్నారు. కాగా ఆయన కనీసం ఏడు ప్రయోగాల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. అంతరిక్షంలో పంట సాగు, వాటర్స్ బేర్ (నీటి ఎలుగుబంటి) గురించి అధ్యయనం చేయనున్నట్లు తెలుస్తోంది. టార్డిగ్రేడ్, సూక్ష్మ కణజాల జీవిగా పిలిచే నీటి ఎలుగుబంటి భూమండలంపై జీవించి ఉండే అత్యంత అరుదైన జీవి. 0.3 మి.మీల నుంచి 0.5 మి.మీల పొడవు ఉండి పర్యావరణంలో అత్యంత కఠినమైన పరిస్థితులను తట్టుకుని జీవించే డీఎన్ఏను కలిగి ఉంటుంది. ఇలాంటి అరుదైన జీవి డీఎన్ఏను డీకోడ్ చేసిన ఇస్రో.. సూక్ష్మ గురుత్వాకర్షణ శక్తిలో పునరుత్పత్తిని.. భూమి, అంతరిక్షంలో జన్యు మార్పిడిని అధ్యయనం చేయనుంది. అత్యంత శక్తిమంతమైన సూర్యరశ్మితో పాటు గురుత్వాకర్షణ కలిగిన వాతావరణంలో ఈ జీవి డీఎన్ఏలో కలిగే మార్పులకు అనుగుణంగా వ్యోమగాముల రక్షణ వ్యవస్థలను తయారు చేయనుంది. ఈ అధ్యయనం త్వరలో ప్రయోగించే మానవసహిత గగన్‌యాన్ మిషన్‌కూ ఉపయోగపడనుందని ఇస్రో అంచనా వేస్తోంది. అలాగే ఈ యాత్రలో భాగంగా అంతరిక్షంలో కంప్యూటర్ స్క్రీన్‌లను ఉపయోగించడం వల్ల కలిగే మార్పులను అర్థంచేసుకోనున్నారు. మైక్రోగ్రావిటీలో గేజ్ ఫిక్సేషన్, వేగంగా కంటిని కదిలించడం వల్ల ఒత్తిడి స్థాయిలు ఎలా ఉంటాయో పరిశీలించనున్నారు. దీనివల్ల భవిష్యత్ అంతరిక్ష నౌకల్లో కంప్యూటర్ల రూపకల్పనకు ఉపయోపడనుంది. ఇలా మొత్తం ఏడు పరిశోధనలు చేయనున్నారు. భారత్ ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన తొలి మానవసహిత అంతరిక్షయాత్ర 'గగన్‌యాన్' కోసం ఇస్రో తీవ్ర కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. దీనికి ముందే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి మన వ్యోమగామి పంపించనున్నారు. భారత్ అమెరికా సంయుక్తంగా చేపడుతోన్న ఈ మిషన్‌లో గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను ఇస్రో ఇదివరకే ఎంపిక చేసింది. గగన్‌యాన్‌కు ఎంపికైన నలుగురు వ్యోమగాముల్లో ఈయనే అతిపిన్న వయస్కుడు కావడం గమనార్హం.

# తొలిసారి 16 కోచ్‌లతో 'నమో భారత్'..
## 24న పట్టాలెక్కనున్న ఈ రైలు ఫీచర్లు తెలుసా?



దిల్లీ: దేశంలో 16 బోగీలతో తొలి నమో భారత్ ర్యాపిడ్ రైలు పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 24న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. బిహార్‌లోని జయ్‌నగర్ పట్నా స్టేషన్ల మధ్య ఈ రైలు సేవలందించనుందని కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ వెల్లడించింది. దేశంలోనే తొలి నమో భారత్ రైలు గతేడాది సెప్టెంబర్‌లో అహ్మదాబాద్ భుజ్ స్టేషన్ల మధ్య ప్రారంభమైనప్పటికీ.. అందులో కేవలం 12 కోచ్‌లు మాత్రమే ఉన్నాయి. ఎక్కువ మంది ప్రయాణికులకు సేవలందించేలా కోచ్‌ల సంఖ్యను పెంచాలని నిర్ణయించిన రైల్వే అధికారులు.. తాజాగా 16 కోచ్‌లతో కొత్త రైలును సిద్ధం చేశారు. అధునాతన సౌకర్యాలతో తీర్చిదిద్దిన నమో భారత్‌ను ప్రధాని నరేంద్ర మోదీ గురువారం పచ్చజెండా ఊపి ప్రారంభించనున్నట్లు రైల్వే బోర్డు అధికారి దిలీప్ కుమార్ వెల్లడించారు. 16 కోచ్‌లతో నడిచే తొలి నమో భారత్ రైలు ఇదేనన్నారు. ఈ రైలు గరిష్ఠంగా 110కి.మీ.ల వేగంతో పరుగులు పెడుతుందని, తద్వారా ప్రయాణ సమయం దాదాపు సగానికి తగ్గుతుందన్నారు. దీంతో ఉద్యోగ, వ్యాపార, విద్య అవసరాల కోసం పట్నా వైపు వెళ్లే ఉత్తర బిహార్‌లోని సామాన్య ప్రజలకు ఈ రైలు వేగవంతమైన, సురక్షిత, సౌకర్యమంతమైన ప్రయాణాన్ని అందిస్తుందని తెలిపారు. ఇందులో అన్నీ ఏసీ కోచ్‌లేనని.. దాదాపు 2 వేల సీటింగ్ సామర్థ్యంతో ఈ రైలు నడుస్తుందని తెలిపారు. మరో వెయ్యి మంది నిలబడి ప్రయాణించవచ్చని తెలిపారు. రైలు నడుస్తున్న సమయంలో నిలబడినవారు బ్యాలెన్స్ కోల్పోకుండా ఉండేందుకు హ్యాండ్ రెయిల్స్, పట్టీలు లేదా స్తంభాలను సైతం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మధుబని, సక్రీ, దర్భంగా, సమస్థిపుర్, బరౌని, మొకమ స్టేషన్ల మీదుగా నడిచే ఈ ర్యాపిడ్ రైలులో ప్రయాణికులు సౌకర్యంగా కూర్చొనేలా సీట్లను ఏర్పాటు చేశారు. అలాగే, టైప్‌సి, టైప్ఎ ఛార్జింగ్ పాయింట్లతో పాటు పూర్తిస్థాయిలో ఏసీ క్యాబిన్‌లు, మాడ్యులర్ ఇంటీరియర్స్, టాయిలెట్స్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. కవచ్ భద్రతా వ్యవస్థ, సీసీటీవీలు, అగ్నిప్రమాదాన్ని గుర్తించే వ్యవస్థ, రెండు వైపులా ఇంజిన్‌లు (పుష్‌పుల్), రైలు చేరుకొనే ప్రతి స్టేషన్ సమాచారాన్ని ప్రదర్శించే రూట్ మ్యాప్‌లు సైతం అందుబాటులో ఉన్నాయి.

# ఉద్ధవ్ ఠాక్రే అభినవ దుర్యోధనుడు: శివసేన తీవ్ర విమర్శలు




ముంబయి: శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేపై శివసేన తీవ్ర విమర్శలు చేసింది. ఆయనో అభినవ దుర్యోధనుడని పేర్కొంది. బాల్‌ఠాక్రే స్థాపించిన పార్టీలో రాజ్ ఠాక్రేను ఆయన ఎదగనివ్వలేదని ఆరోపించింది. శివసేన అధికార ప్రతినిధి, ఎంపీ నరేశ్ మష్కే మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రెండు దశాబ్దాలుగా విరోధులుగా ఉన్న నవనిర్మాణ్ సేన, శివసేనల అధ్యక్షులు త్వరలో కలిసి పోనున్నారనే వార్తలు మహారాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిగా మారాయి. ఈ నేపథ్యంలో మష్కే మాట్లాడుతూ.. క్షీణిస్తున్న పార్టీని కాపాడుకోవడంలో భాగంగానే ఉద్ధవ్ ఠాక్రే చర్యలు ఉన్నాయని విమర్శించారు. "యూబీటీ వర్గంలో జనాలను ఆకట్టుకునే నేత లేదు. దీంతో వారు రాజ్ ఠాక్రే వైపు మొగ్గు చూపిస్తున్నారు. లోక్‌సభ, రాజ్యసభలో పార్టీ అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇక ఉద్ధవ్ ఠాక్రే అభినవ దుర్యోధనుడు. పార్టీలో రాజ్ ఠాక్రేకు కీలక బాధ్యతలు అప్పగించాలని బాలాసాహెబ్ కోరినా.. అతడిని పార్టీలో ఎదగనివ్వలేదు" అని ఆరోపించారు. "వారు ఆయనని మునిగిపోతున్న ఓడలోకి ఎక్కించాలనుకుంటున్నారు. కానీ రాజ్ అమాయక రాజకీయ నాయకుడు కాదు" అని పేర్కొన్నారు. నవనిర్మాణ్ సేన, శివసేనల అధ్యక్షులు త్వరలో కలిసి పోనున్నారనే వార్తలపై తాజాగా ఉద్ధవ్ సేన నేత సంజయ్ రౌత్ మాట్లాడుతూ.. రాజకీయ పొత్తుకు సంబంధించి ఎటువంటి సంప్రదింపులు జరగలేదని, కేవలం వీరి మధ్య భావోద్వేగ చర్చలు మాత్రమే జరుగుతున్నాయని స్పష్టం చేశారు.

# ఓటమిపాలైనా పాఠాలు నేర్చుకోవట్లేదు.. రాహుల్ వ్యాఖ్యలపై అనురాగ్ ఠాకూర్



దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల వ్యవస్థనుద్దేశించి అమెరికాలోని బోస్టన్‌లో చేసిన వ్యాఖ్యలపై భాజపా తీవ్రంగా స్పందించింది. ఎన్నికల వ్యవస్థలో లోపాలున్నాయని, ఎన్నికల్లో ఆ వ్యవస్థ రాజీపడినట్లు కనబడుతోందంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలపై భాజపా ఎంపీ అనురాగ్ ఠాకూర్ మండిపడ్డారు. ఎన్నికల్లో అనేక సార్లు ఓడిపోయినా.. కొన్ని రాజకీయ పార్టీలు, నేతలు ఎలాంటి పాఠాలు నేర్చుకోవడంలేదన్నారు. ఈవీఎంలు, ఈసీ, ప్రజాస్వామిక సంస్థలను ప్రశ్నిస్తున్నారన్నారు. ఈ చర్యలు విదేశీ గడ్డపై భారత్‌ను అవమానించడమేనంటూ ధ్వజమెత్తారు. 'విదేశాల్లోనే ఎక్కువ కాలం గడిపే రాహుల్ గాంధీ, ఆయన మద్దతుదారులకు ఒక్కటే చెప్పదలచుకున్నా.. మీరు భారత్‌ను ఎంతగా అవమానిస్తే.. ప్రజలు కూడా అదే రీతిలో సమాధానం ఇస్తారు' అని

# ఛాతీ నొప్పితో ఆస్పత్రిలో చేరిన బెంగాల్ గవర్నర్

పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ ఛాతీ నొప్పితో ఆస్పత్రిలో చేరారు. కోల్‌కతాలోని ఈస్ట్రన్ కమాండ్ ఆసుపత్రిలో ఆయనకు అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. శనివారం రాత్రి ముర్షిదాబాద్‌లో అల్లర్లు జరిగిన ప్రాంతాలకు వెళ్లి తిరిగి వచ్చిన అనంతరం ఆయన ఛాతీలో నొప్పి ఉన్నట్లు చెప్పారని..సోమవారం నొప్పి మరింత తీవ్రంకావడంతో ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

...wned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri ...-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.